


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 29 డిసెంబరు 2021 సంపుటి: 03 సంచిక: 122 పేజీలు: 4 వెల: రూ 3-00


## రోబోలుగా మారకండి : మోదీ



న్యూఢిల్లీ : నిమ్మళంగా ఉండే పరిస్థితుల్లో ఉండాలని కోరుకోవడానికి బదులుగా సవాళ్ళను ఎంచుకోవాలని విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇప్పుడు కొత్తవాటి గురించి భయం అనేదే లేదన్నారు. యావత్తు ప్రపంచాన్ని తెలుసుకునే సత్తా విద్యార్థులకు ఉందన్నారు. 'ఫలానా విషయం తెలియదు' అనే ప్రశ్నే ఇక లేదని, అత్యుత్తమమైనదాని కోసం అన్వేషణ, యావత్తు ప్రపంచాన్ని జయించాలనే కల ఉన్నాయని చెప్పారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కాన్పూరు 54వ స్నాతకోత్సవంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ సంస్థలో వెచ్చించిన సమయం విద్యార్థుల్లో పెను మార్పులను తీసుకొచ్చిందన్నారు. వారికి ఐఐటీ కాన్పూరు ఓ గొప్ప వేదికను అందుబాటులో ఉంచిందని చెప్పారు. విద్యార్థులు సవాళ్ళను ఎంచుకోవాలని, నిమ్మళం (కంఫర్ట్)గా ఉండే పరిస్థితులను కాదని తెలిపారు. ఇప్పుడు తెలియనివాటి గురించి భయమే లేదన్నారు. యావత్తు ప్రపంచాన్ని అర్థం చేసుకోగలిగే సత్తా విద్యార్థులకు ఉందని చెప్పారు. ఫలానా విషయం తెలియదనే ప్రశ్నే ఇక లేదని, అత్యుత్తమమైనదాని కోసం అన్వేషించవచ్చునని, యావత్తు ప్రపంచాన్ని జయించాలని కలలుగనవచ్చునని తెలిపారు. విద్యార్థులు పొందిన శిక్షణ, సంపాదించిన నైపుణ్యం, విజ్ఞానం కచ్చితంగా ఈ ప్రపంచంలో తమదైన ముద్ర వేసుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి, విజేతలుగా నిలవాలని చెప్తూ, రోబోలుగా మారిపోవద్దని హెచ్చరించారు.

## వివక్ష లేదు.. లంచాలకు తావులేదు: సీఎం జగన్



అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హత ఉండి మిగిలిపోయిన వారికి మంగళవారం ఆయన నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ రోజు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని.. 9,30,809 మందికి వారి ఖాతాల్లో రూ. 703 కోట్లను జమచేస్తున్నామని తెలిపారు."గతంలో పథకాలకోసం ప్రజలు ఎదురుచూసేవారు. ఇప్పుడు ప్రజలనే నేరుగా వెతుక్కుంటూ పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలు అమలు చేసేటప్పుడు మనం కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడ్డం లేదు. అర్హత ఉంటే చాలు, సంక్షేమ పథకాలు అందరికీ దక్కుతాయన్న కోణంలోనే ప్రతి అడుగూ వేస్తున్నాం. ఇంకా ఎక్కడైనా అర్హులైన ఉండి కూడా దరఖాస్తు చేసుకోలేకపోవడమో, అర్హత నిర్ధారణలో జరిగిన పొరపాట్లవలనో, నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోకపోవడంవల్లో, బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేపోవడం వల్లో ఇలా ఏ కారణాలు అయినా సరే అర్హులందరికీ కూడా సంక్షేమ పథకాలు అందనట్టు అయితే అటువంటి వారు అందరూ కూడా మిస్‌కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని" సీఎం పేర్కొన్నారు.

ఇది గొప్ప విప్లవాత్మక మార్పు:"గతంలో ప్రభుత్వాలు.. ఎలా కత్తిరించాలి.. అనిఆలోచించేవి. ఎవరూ మిగిలిపోకూడదు, అర్హులకు అందరికీ అందలాన్న తపన, తాపత్రయం ఈ ప్రభుత్వంలో ఉంది. దేశంలో తొలిసారిగా మిస్ అయిన వారికి కూడా ఒక అవకాశం ఇచ్చి, వారికి కూడా నెలరోజుల్లోపు దరఖాస్తులు చేసుకోమని చెప్పి, పరిశీలనలు చేసి వారిక్కూడా రావాల్సిన డబ్బును అందిస్తున్నాం. పెన్షన్‌లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాల లబ్ధిదారులను తీసుకున్నా.. గత ప్రభుత్వంతో కంటే లబ్ధిదారుల సంఖ్యలో కాని, వారికి ఇస్తున్న మొత్తంలోగాని విపరీతమైన మార్పు ఉంది.విప్లవాత్మకంగా ఈ మార్పునకు శ్రీకారం చుట్టడం జరిగింది. టీడీపీ హయాంలో పెన్షన్ల రూపంలో ఎన్నికలకు 2 నెలలముందు వరకూ కేవలం రూ.1000లు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఎన్నికలకు 6 నెలలకు ముందు వరకూ కేవలం 39 లక్షలమందికి, నెలకు రూ.400 కోట్లు ఇచ్చేవారు. ఇవాళ 61లక్షల పెన్షన్లకు పెంచాం. పెన్షన్‌ను రూ.2250లకు పెంచాం. రూ.1450 కోట్లు నెలకు కేవలం పెన్షన్లకోసమే ఖర్చు చేస్తున్నాం. ఎవ్వరూ ఇబ్బంది పడకూడదని తెల్లవారుజామునే వాలంటీర్ వచ్చి గుడ్‌మార్నింగ్‌చెప్పి.. చేతిలో పెన్షన్ పెట్టబోతున్నారు. ఈ ఒకటో తారీఖు నుంచి రూ.2500కు పెంచబోతున్నాం.గతంలో పథకాలను ఎగ్గొట్టేందుకు, లంచాలు గుంజేందుకు జన్మభూమి కమిటీలు పెడితే... గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి సోషల్‌ఆడిట్ ద్వారా అర్హులందరికీ న్యాయం ఇవాళ న్యాయం జరుగుతుంది. గతంలో ఆత్మాభిమానం చంపుకుని వృద్ధులు, వికలాంగులు పెన్షన్లకోసం తిరిగే వారు. వివక్ష లేకుండా, లంచాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తున్నాం. కోవిడ్ వల్ల ప్రభుత్వ రాబడి తగ్గినా, ఖర్చులు పెరిగినా పేదలకు అండదండలు అందించేందుకు మన ప్రభుత్వం అడుగులు ముందుకేసిందని" సీఎం అన్నారు.

వివిధ పథకాల్లో మిస్ అయిన వారికి ఇవాళ ఇస్తున్న ప్రయోజనాలు ఇవీ:

వైఎస్సార్ చేయూత కింద 2,50,929 మందికి రూ. 470.40 కోట్లు ఇవాళ అందిస్తున్నాం

వైఎస్సార్ ఆసరా కింద 1,136 మందికి రూ. 7.67 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ సున్నావడ్డీ కింద మహిళలకు 59,661 మందికి రూ. 53,51కోట్లు అందిస్తున్నాం

వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు కింద 2019?20 ఏడాది కింద 62,622 మందికి రూ. 9.01కోట్లు, ఖరీఫ్ 2020 కింద 58,821 మందికి 10.06 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ రైతు భరోకకింద 2,86,059 మందికి రూ. 58.89 కోట్లు ఇస్తున్నాం

జగనన్న విద్యా దీవెన కింద 31,940 మందికి రూ.19.92 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ వసతి దీవెన కింద 43,010 మందికి రూ. 39.82 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ కాపు నేస్తం కింద 12,983 మందికి రూ.19.47 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ వాహన మిత్ర కింద 8,080 మందికి రూ.8.09 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద 3,788 మందికి రూ. 3,79 కోట్లు ఇస్తున్నాం

వైఎస్సార్ నేతన్న నేతన్న నేస్తం కింద 794 మందికి రూ.1.91 కోట్లు అందిస్తున్నాం

ఇవికాక 90 రోజుల్లో ఇళ్లపట్టాలు 1,10,986 కు ఇస్తున్నాం

ఇవికాకుండా 1,51,562 లక్షల మందికి పెన్షన్‌కార్డులు ఇస్తున్నాం, ఏప్రిల్ 2021 నుంచి ఇచ్చిన పెన్షన్‌కార్డులు కలుపుకుంటే 4,96,059 మందికి పెన్షన్‌కార్డులు ఇచ్చాం. బియ్యంకార్డులు 3,07,599 మందికి ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీ కార్డులు 1,14,129 మందికి ఇస్తున్నాం. డిసెంబర్ నుంచి మే వరకూ అమలైన పథకాల్లో అర్హత ఉండి మిస్ అయిన వారికి జూన్ లోనూ, అలాగే జూన్ నుంచి నవంబర్ వరకూ అమలైన పథకాల్లో మిస్ అయిన వారికి డిసెంబర్‌లోనూ అందించే కార్యక్రమాన్ని ఇవాళ ప్రారంభిస్తున్నామని" సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## 'చంద్రబాబు వద్దన్నాడనే ప్రత్యేక హోదా ఇవ్వలేదు'

విజయవాడ: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక హోదా వద్దన్నాడనే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు. చంద్రబాబు ప్రత్యేక హోదా వద్దని, ప్రత్యేక ప్యాకేజీ కావాలన్నారని సోము వీర్రాజు స్పష్టం చేశారు. చంద్రబాబు వద్దన్నాడనే కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు.బహిరంగ సభలో సోము వీర్రాజు మాట్లాడుతూ.. 'అమరావతిని సింగపూర్, జపాన్ చేస్తా అంటూ చంద్రబాబు ప్రచారం చేసుకున్నారు. ప్రజల డబ్బుతో చంద్రబాబు హైదరాబాద్ లో ఇల్లు కట్టుకున్నారు. ప్రత్యేక హోదా అంటున్నారు...ఎందుకు వద్దన్నాడో చంద్రబాబుని అడగండి. చంద్రబాబు ప్రత్యేకహోదా వద్దు... ప్రత్యేక ప్యాకేజీ కావాలన్నారు. చంద్రబాబు వద్దన్నాడని ప్రత్యేక హోదా ఇవ్వలేదు' అని తెలిపారు.



## వచ్చే ఎన్నికల్లో బీజేపీ 10 నుంచి 20 శాతం డిపాజిట్లు తెచ్చుకుంటే గొప్ప

### మంత్రి కొడాలి నానిని సంచలన వ్యాఖ్యలు



విజయవాడ డిసెంబర్ 28 బీజేపీ పార్టీ ప్రజాగ్రహ సభ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సభ ప్రభావం అధికార పార్టీపై పడుతుందా..? అని కొందరు మంత్రి కొడాలి నానిని అడిగారు. దీంతో ఆయన ఓ ఛాలెంజింగ్ ఆన్సర్ చేశారు. అలా చేస్తే బీజేపీ గొప్ప పార్టీ అని అంటానని చెప్పారు. ఇంతకీ కొడాలి నాని ఎలాంటి కామెంట్లు చేశారు..?ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారనే నేపథ్యంలో ఏపీ బీజేపీ ప్రజాగ్రహ సభ నిర్వహిస్తోంది.అయితే మంత్రి కొడాలి నాని ప్రెస్ మీట్ పెట్టిన సందర్భంలో కొందరు ప్రజాగ్రహ సభ గురించి ప్రస్తావించారు. దీనిపై మట్లాడాలని కోరారు. దీంతో మంత్రి నాని మాట్లాడుతూ 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ 10 నుంచి 20 శాతం డిపాజిట్లు తెచ్చుకుంటే ఆ పార్టీ గొప్పదని అంటా..ప్రతిపక్షాలు ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని అంటున్నారే తప్ప ప్రజల్లో అలాంటి ఆలోచన లేదు' అని అన్నారు. అయితే మంత్రి ఆ పార్టీని కేవలం డిపాజిట్లు తెచ్చుకుంటే చాలని అన్నారు. అయితే మంత్రి వ్యాఖ్యలను ఒకసారి పరిశీలిస్తే వాస్తవం బయటపడుతోంది.గత ఎన్నికల్లో బీజేపీకి చాలా చోట్ల డిపాజిట్లు రాలేదు. పరువుపోతుందన్న భయంతోనే దొరికిన వారికి భీం ఫాంలు ఇచ్చేశారు. ఒక్క సీటు కూడా గెలవకపోగా చాలా చోట్ల డిపాజిట్లు దక్కలేదు. దీంతో మంత్రి వచ్చే ఎన్నికల్లో10నుంచి20శాతం తెచ్చుకోవాలన్నారు. అంటే 175 సీట్లలో 10 శాతం అంటే 35 స్థానాల్లో కేవలం డిపాజిట్లు తెచ్చుకుంటా చాలని సవాల్ విసిరారు. అయితే గత ఎన్నికల నుంచి ఇప్పటి వరకు బీజేపీలో ఎలాంటి మార్పు రాలేదు. ఏవో జనసేనతో కలిసి అడపా దడపా పోరాటాలు చేయడమే ఒక్కటీ సరైన విధంగా ఆందోళన కార్యక్రమం చేపట్టలేదని అంటున్నారు.

## పిల్లలకు టీకా.. జనవరి 1 నుంచి టీకా రిజిస్ట్రేషన్లు

అమరావతి: వచ్చే జనవరి 3వ తేదీ నుంచి 15?18 ఏళ్ల లోపు పిల్లలకు కరోనా టీకా పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జనవరి 1వ తేదీ నుంచి టీకా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సోమవారం ప్రకటించింది. కోవిన్ యాప్/వెబ్‌సైట్‌లో అర్హులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెల్లడించింది. ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది.ప్రభుత్వ గుర్తింపు కార్డులులేని వారు విద్యా సంస్థలు మంజూరు చేసిన గుర్తింపు కార్డులతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 15?18 ఏళ్ల వయసులోపు వారు 22,41,000 మంది ఉన్నారు. టీకాల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందాల్సి ఉంది. కోవిన్ యాప్‌లో రిజస్ట్రేషన్ చేసుకోకుంటే, స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుందో, లేదో అనే విషయం కేంద్రం ఇచ్చే మార్గదర్శకాల్లో



స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

రిజిస్ట్రేషన్ ఇలా..

కోవిన్ మొబైల్ యాప్ లేదా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

యాప్ లేదా పోర్టల్‌లోకి లాగిన్ అయ్యాక ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి.

అనంతరం ఫోన్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి.

ఒక ఫోన్ నంబర్‌పై నలుగురు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. (ఉదా.. గతంలో తల్లిదండ్రులిద్దరూ కోవిన్ యాప్‌లో రిజిస్టరైన నంబరుతో వారి పిల్లల (15?18ఏళ్ల మధ్య వారైతేనే) పేర్లు కూడా నమోదు చేసుకోవచ్చు.)

వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రిజిస్ట్రేషన్ పేజీ వస్తుంది. అందులో పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలను నమోదు చేయాలి. గుర్తింపు కార్డు కింద ఆధార్‌ను ఎంచుకోవాలి. ఆధార్‌లేని పక్షంలో పదో తరగతి విద్యార్థి గుర్తింపు ఐడీ నంబరును నమోదు చేయవచ్చు.

## ఆయన స్టాలిన్ కోసమో, మోడీ కోసమో అనుంటాడు

### మంత్రి పేర్ని నాని

అమరావతి సినిమా టికెట్ల ధరలపై హీరో నాని, సిద్దార్థ్‌లకు మంత్రి పేర్ని నాని కౌంటర్ ఇచ్చారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మాట్లాడేవాళ్ళు తెలిసి మాట్లాడుతున్నారో, తెలియక మాట్లాడుతున్నారో తెలియదు. సెప్టెంబర్‌లో డిస్ట్రిబ్యూటర్‌లు, ఎగ్జిబిటర్లుతో సమావేశం పెట్టాం. ఆ రోజే సినిమా హాళ్ల యజమానులు అనుమతులు, ఫైర్ ఎన్‌ఓసీ కానీ తీసుకోవడం లేదు. వీటిని రెన్యువల్ చేసుకోమని ఆనాడే చెప్పాము. అయినా అనుమతులు లేకుండా నడిపారు. అనుమతులు తీసుకోని థియేటర్లపైనే చర్యలు తీసుకున్నాం. ఇందులో ఎవరి మీదనో కక్ష ఎందుకు ఉంటుంది. 130 సినిమా హాళ్ల పై చర్యలు తీసుకున్నాము. ఇవన్నీ నిబంధనలు ఉల్లంఘించిన థియేటర్లే. చిత్తూరులో 24, కృష్ణా జిల్లా లో 12 సీజ్ చేశాము. లైసెన్స్ లేని వాళ్ళు 22 థియేటర్లు మూసేశారు. 83 సీజ్ చేశాం, 23 థియేటర్లపై ఫైన్ వేశాం. జీవో 35ని ఏప్రిల్‌లో ఇచ్చాము. మరి ఈ రోజు ఆ జీవోకి నిరసనగా మూసివేయడానికి నాని ఏ ఊరు లో ఉన్నారో.. ఆయన ఏ కిరాణా కొట్టు లెక్కలు లెక్కపెట్టారో తెలియదు. మరో నటుడు సిద్దార్థ్ ఎక్కడుంటారు..?. ఆయన చెన్నై లో స్టాలిన్ కోసం మాట్లాడారేమో. సిద్దార్థ్ ఏమైనా ఇక్కడ టాక్స్‌లు కట్టాడా. మా ఇళ్లకి వచ్చి చూసాడా. మేము ఎంత విలాసంగా ఉంటున్నామో.

## దిశా యాప్ టార్గెట్ కోటి డౌన్ లోడ్ లు

### రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్

మంగళగిరి డిసెంబర్ 28, (న్యూస్ పల్స్) సామన్య వ్యక్తులు కూడ పోలీస్ దగ్గరకు వెళ్ళేందుకు అవకాశం కలిగింది.గతంలో ఇటు వంటి పరిస్థితి లేదు.ఇన్వేస్టిగేషన్ చేసి ఛార్జిషీట దాఖాలు చేయడంలో గత ఐదు సంవత్సరాల కాలంలో 75.09 % మెరుగైందని రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ అన్నారు. బుధవారం అయన రాష్ట్ర పోలీసు శాఖ వార్షిక నివేదికను విడుదల ఏసారు. సిఎడబ్లు 42 % మెరుగైంది.దిశ చట్టం కొచ్చినప్పుడు తక్కువ కాలలో ఇన్వేస్టిగేషన్ జరుగుతుందా అనే అనుమానాలను పటాపంచలు చేసి త్వరతగతిన ఇన్వేస్టిగేషన్ చేసి కేసులు నమోదు చేస్తున్నామనన్నారు.దిశ కోటి డౌన్ లోడ్ లు చేయలన్నరు కాని 97 లక్షల పై చిలుకు డౌన్ లోడ్ చేసుకున్నారని అన్నారు. దిశ యాప్ త్వరగానే రెస్పాండ్ అయిన విషయం తెలిసిందే అన్నారు. స్పందనలో భాగంగా 163 033 పీటిషన్స్ వస్తే 40,404 ఎఫ్ ఐఆర్ నమోదు చేశామన్నారు. మిగితావి కూడ విచారణజరిపి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు.గతంలో లాగ కాక పోలిస్ స్టేషన్ లోకి వెళ్ళి కంప్లేంట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మైనర్ లు కూడ కంప్లేంట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ పరివర్తనలో భాంగంగా ఏజెన్సీ ఏరియాలో 2,762 ఎకరాల గంజాయి సాగుల్నీ ద్వంసం చేశామన్నారు. ఎక్సైజ్ కేసుల్లో 43,293 కేసుల్లో 60,868 మందిని అరెస్ట్ చేశి 20 ,945 వాహనాలను స్వాధినం చేసుకున్నామని తెలిపారు. టెక్నాలజీ ద్వార నేర పరిశోధన కొత్త పుంతలు తోక్కుతుందని అన్నారు. దాని ద్వార మొబైల్ అప్లికేషన్ సెంట్రల్ లాక్,ఇన్వేస్టిగేషన్ ట్రాక్కర్ జిఐయస్,జిపియస్ విధానం పద్దతులు డిజిటల్ విధానం అనుసరిస్తున్నామని తెలిపారు



# సంపాదకీయం

బుధవారం 29 డిసెంబరు 2021

## బాలీవుడ్ ను మించిపోతున్న సౌత్ ఇండస్ట్రీ

పాశ్చాత్య చిత్ర పరిశ్రమకు హాలీవుడ్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు బాలీవుడ్ అలా. ప్రపంచం దృష్టిలో భారతీయ సినిమా అంటే హిందీ సినిమా. ఐతే, ఇప్పుడు ఆ ముద్ర చెరిగిపోతోంది. అసురన్, జైభీమ్, పుష్ప వంటి సినిమాలు బాలీవుడ్‌పై టాలీవుడ్ పై చేయి సాధిస్తోంది అని చెప్పటానికి ఉదాహరణలు. అసురన్ పలు అంతర్జాతీయ ఆవార్డులు గెలుచుకోగా.. జైభీమ్ భారీ హాలీవుడ్ సినిమాలను తలదన్ని ఇంటర్నెట్ టాపర్‌గా నిలిచింది. అల్లు అర్జున్ పుష్ప వసూళ్లలో దూసుకుపోతోంది. ఇప్పటికే 170 కోట్లు వసూలు చేసిన పుష్ప త్వరలో రెండు వందల కోట్ల క్లబ్‌లో చేరేందుకు పరుగులు తీస్తోంది. ఏ రకంగా చూసినా ఇండియన్ సినిమా అంటే కేవలం బాలీవుడ్ మాత్రమే కాదనటానికి ఇది ఒక నిదర్శనం.ఇప్పుడు, హిందీ సినిమాల కన్నా దక్షిణాది భాషా చిత్రాలనే జనం ఎక్కువగా ఆదరిస్తున్నారని ఇటీవల హిందీలో పెరుగుతున్న రీమేక్‌లే చెబుతున్నాయి. నిజానికి దక్షిణాది సినిమాలు హిందీలో రీమేక్ అవటం కొత్త కాదు..నాటి ఏక్ దుజే కేలియే నుంచి నిన్నటి బాహుబలి వరకు ఎన్నో సినిమాలను అందుకు ఉదాహరణలు. సల్మాన్ ఖాన్‌ని బాలీవుడ్ భాయిజాన్‌ని చేసింది ఏక్ థా టైగర్, దబాంగ్ కాదు, తెలుగు రీమేక్ "వాంటెడ్". 2006లో మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాని పదేళ్ల తరువాత హిందీలో తిరిగి తీశారు. దాదాపు వందకోట్లు రాబట్టింది ఆ సినిమా. అంతేకాదు, సల్మాన్ ఖాన్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది.2006లో రవితేజ నటించిన విక్రమార్కుడు, అక్షయ్ కుమార్ హీరోగా 2012లో రౌడీ రాథోడ్‌గా వచ్చింది. రామ్ నటించిన రెడీ (2008) సల్మాన్ హీరోగా 2011లో అదే పేరుతో రీమేక్ అయింది. విజయ్ దేవరకొండ నటించిన అర్జున్ రెడ్డిని 2019లో షాహిద్ కపూర్ హీరోగా హిందీలో పునర్నిర్మించారు.దక్షిణాది సినిమాలు హిందీలో రీమేక్ చేయటం కొత్త కాదు. దశాబ్దాలుగా వస్తోంది. ఐతే, ఇప్పుడు ఎంటర్‌టెయిన్‌మెంట్ రంగంలో ఓటీటీలు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. లివింగ్‌రూంలో కూర్చుని నచ్చిన సినిమా చూడగలుగుతాము. ఏ భాష సినిమా కావాలంటే ఆ భాష సినిమా చూడొచ్చు. అలాగే, దక్షిణాది సినిమాలకు రోజు రోజుకు దేశ వ్యాప్త మార్కెట్ పెరుగుతోంది. దాంతో అక్కడి చెందిన ఫిలింమేకర్స్ ఏక కాలంలో వివిధ భాషలలో తమ సినిమాలను విడుదల చేస్తున్నారు. కాబట్టి ఇక ముందు రీమేక్‌ల వేగం తగ్గొచ్చని సినీ పండితులు అంటున్నారు.ఓటీటీ కల్చర్ విస్తృతమవుతున్న వేళ బాలీవుడ్ రేస్‌లో దక్షిణాది సినిమాలకు భాషా పరమైన అడ్డంకి తొలగిపోతోంది. అల్లు అర్జున్ తాజా హిట్ పుష్ప హిందీ వెర్షన్ మహారాష్ట్ర, గుజరాత్, ఒడిషా, బీహార్‌లో మంచి వసూళ్లు సాధిస్తోంది. కాబట్టి, సినిమాలో విషయం ఉంటే జనం ఆదరిస్తారనటానికి ఇదో ఉదాహరణ . దక్షిణాది చిత్రాలు, ముఖ్యంగా తమిళ్, తెలుగు సినిమాలు ఈ విషయంలో హిందీ సినిమాల కన్నా చాలా ముందున్నాయి.దక్షిణాది దర్శకులు ప్రేక్షకుల అభిరుచిని కనిపెట్టి సినిమాలు తీస్తారు.అందుకు అనుగుణంగా కథలు సృష్టిస్తారు. అందుకే, ప్రభాస్, మహేష్ బాబు , జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్,అల్లు అర్జున్ సినిమాలకు దేశ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. అలాగే తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్ నటించిన చిత్రాలకు కూడా దేశ విదేశాల్లోని భారతీయుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది.దక్షిణాది ఫిలిం మేకర్స్ అందరూ మెచ్చే కథాంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం వల్లే అవి చిన్న చిన్న పట్టణాల నుంచి మహానగరాల ప్రేక్షకుల వరకు అందరి ఆదరణ పొందుతున్నాయి. కానీ, బాలీవుడ్ నిర్మాత, దర్శకులు కేవలం మల్టీప్లెక్స్ ప్రేక్షకుల కోసమే సినిమాలు తీస్తున్నట్టు కనిపిస్తోంది. అలా తీయటం తప్పుకాదు..కానీ అదే సమయంలో సామాన్య ప్రేక్షకుల అభిరుచులను విస్మరించకూడదు. చాలా కాలంగా బాలీవుడ్ ఫిలింమేకర్స్ చేస్తున్న పొరపాటు ఇదే.మరోవైపు, ఓటీటీల పుణ్యమా అని సౌత్ స్టార్లకు దేశం అంతటా గిరాకీ పెరిగింది.పలువురు దక్షిణాది హీరోలు పాన్ ఇండియా మార్కెట్ ఉంది. పెద్ద మొత్తంలో రెమ్యూనిరేషన్ డిమాండ్ చేస్తున్నారు. బాహుబలి తరువాత ప్రభాస్ రేంజ్ మారిపోయింది. ఇప్పుడు ఆయన సినిమాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అర్జున్ రెడ్డి డైరెక్టర్ సందీప్ వంగ సినిమాకు 150 కోట్లు డిమాండ్ చేసినట్టు టాలీవుడ్ టాక్. ప్రభాస్ చివరి చిత్రం సాహూ ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయినా నిర్మాతలను నష్టాల పాలయితే చేయలేదు. ఈ నేపథ్యంలో సౌత్ సినిమా బాలీవుడ్‌ను అధిగమిస్తుందా? అనే ప్రశ్న రాకుండా ఉండదు.ఇప్పుడు భారతీయ సినిమాలో నవశకం నడుస్తోంది. వంద రోజుల ఫంక్షన్లు ..సిల్వర్ జూబ్లీలు గోల్డెన్ జూబ్లీలు లేని శకం. నిజానికి సిని పరిశ్రమ వీటికి ఏనాడో దూరమైంది, అది వేరే సంగతి. కానీ..ఇప్పుడు ఓటీటీ తరం భాషా అడ్డుగోడలను కూల్చుతోంది. బాలీవుడ్ సినిమా కావచ్చు..శాండల్‌వుడ్ సినిమా కావచ్చు. సినిమా నచ్చాలి అంతే. హిందీ, మరాఠీ, బెంగాలీ, తమిళం, తెలుగు, భోజ్‌పురి..నచ్చిన సినిమాని ఇంట్లో కూర్చుని చూస్తున్నారు. కాబట్టి, ఈ సంధికాలంలో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించటం సినీ రంగం మీద ఉన్న పెద్ద బాధ్యత. ఓటీటీ సినిమాలకు అలవాటు పడిన వారు థియేటర్‌కు రప్పించాలంటే జనరంజక సినిమాలు ఎక్కువగా రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రేక్షకులకు నచ్చింది ఇవ్వాలి.. లేదంటే దానిని వారు వేరే చోట వెతుక్కుంటారు. ఈ సూత్రాన్ని బాలీవుడ్ ఫిలిం మేకర్లు కూడా తెలుసుకుంటే మంచిది.నిజానికి దక్షిణ భారతదేశంలోని భాషా చిత్ర పరిశ్రమలకు తమవైన ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. భాషా పరంగా..సంస్కృతి..సాంప్రదాయల పరంగా వాటికి గొప్ప చరిత్ర ఉంది. తెలుగు, తమిళ, కన్నడ, మళయాలీ చిత్ర పరిశ్రమలకు నాణ్యతా పరంగానే గాక సంఖ్యా పరంగానూ గొప్ప పేరుంది. కాలంతో పాటు అనేక ప్రయోగాలు చేస్తున్నాయి. 'బాహుబలి' వంటి జానపథ గాథ నుంచి ఎంథిరన్ వంటి ఉన్నత సాంకేతిక విలువలతో కూడిన అనేక సినిమాలు దక్షిణాది నుంచే వచ్చాయి. 'సూపర్ డీలక్స్' వంటి థ్రిల్లింగ్ ఎక్సపర్మెంట్లు కూడా దక్షిణాది ఫిలిం మేకర్స్ నుంచి వస్తాయి. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్,' వంటి సినిమాలు దక్షిణాది సినీ పరిశ్రమకు ఏ ఫార్ములా లేదని నిరూపిస్తున్నాయి.మరోవైపు, హిందీ పరిశ్రమలో చాలా వరకు సాహసాలు ఉండవు. హీరోలు కూడా వెనకాడతారు. కానీ దక్షిణాదిలో ఈ తరం నటులు నటనా ప్రాధాన్యం కలిగిన పాత్రలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏక కాలంలో హీరోగా .. విలన్‌గా మెప్పిస్తున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి 'సూపర్ డీలక్స్'లో ట్రాన్స్‌జెండర్ పాత్రలో నటించటం గొప్ప విషయమే కదా. అలాగే మలయాళంలో దుల్కర్ సల్మాన్ 'కురుప్'లో క్రిమినల్ పాత్రను పోషించాడు. 37 ఏళ్లుగా కేరళ పోలీసులకు తప్పించుకు తిరుగుతున్న సుకుమార్ కురుప్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందింది.బాలీవుడ్ నిర్మాణ సంస్థలు ఇప్పటికీ పాత ఫార్ములానే నమ్ముకుని సినామాలు తీస్తున్నారు.

# రఘువీరారెడ్డి సెకండ్ ఇన్నింగ్స్



అనంతపురం, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)మౌన ముని మౌనం వీడారా?.. ఆయన యాక్టీవ్ పాలిటిక్స్ లోకి వస్తున్నారా? అంటే.. ఆ సీనియర్ లీడర్ వద్ద నుంచి సమాధానం లేదు కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఆయన ఒక్కో రోజు ఒక్కో పార్టీలోకి వెళ్తున్నారంటూ విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలోకి వెళ్తున్నారని కొందరు.. లేదు బీజేపీలోకి వెళ్తున్నారని మరికొందరు.. కాదు కాదు వైసీపీలోకి వెళ్తున్నారని ఇంకొందరు. చివరకు పార్టీ మారుతున్నది ఆయన కాదు.. ఆయన కూతురు అంటూ ప్రచారం మొదలు పెట్టారు. ఇంతకీ అంత హాట్ టాపిక్ గా మారిన ఆ సీనియర్ లీడర్ ఎవరు?.. ఏంటా ప్రచారం కథ? ఇప్పుడు తెలుసుకుందాం..రఘువీరారెడ్డి.. ఇటు ఆంధ్రప్రదేశ్ అటు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలకు పరిచయం అక్కర్లేని పేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రెండు సార్లు మంత్రిగా.. సుదీర్ఘకాలం పాటు పీసీసీ అధ్యక్షుడిగా.. అంతెందుకు సీఎం రేస్ వరకు వెళ్లిన నాయకుడు ఆయన. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ ప్రయాణం చేసిన ఆయన రాష్ట్ర విభజన తరువాత కూడా ఆ పార్టీని వీడలేదు. చివరకు 2019 ఎన్నికల వరకు పార్టీ గెలుపు కోసం పని చేశారు. కానీ ఏం చేస్తాం.. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఇప్పట్లో లేచేలా లేదు. ఆ ఎన్నికల్లో ఓటమి తరువాత రాజకీయ వైరాగ్యంతో పీసీసీ పదవికి రాజీనామా చేసి ఆయన స్వగ్రామం మడకశిర మండలం నీలకంఠాపురం వెళ్లిపోయారు. అక్కడ శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిమాణం చేపట్టారు. రెండేళ్ల పాటు ఆ కార్యక్రమంలో ఉండి.. జిల్లాలో ఒక అద్భుత దేవాలయం నిర్మాణం చేపట్టే వరకు నిద్రపోలేదు. ఆయన రెండేళ్ల నుంచి రాజకీయాల జోలికి వెళ్లలేదు. అంతెందుకు కనీసం ఒక్క మాట కూడా ఎక్కడా మాట్లాడింది లేదు. కానీ అప్పుడప్పుడు పొలం పనులు చేసే రైతుగా.. గ్రామంలో కూలీలతో కలసి వ్యవసాయ కూలీగా కనిపించారు. గ్రామంలో పిల్లలతో ఆటలు, పెద్దలతో ముచ్చట్లతో.. టీవీఎస్ మోపెడ్ పై పచ్చటి పొలాల మధ్య చక్కర్లు కొడుతూ కనిపించారు.అయితే ఆలయ నిర్మాణ పనులు పూర్తైనా.. ఇంకా ఎందుకు రఘువీరా మౌనం వీడలేదు అంటే ఎవరి వద్ద సమాధానం లేదు. కానీ గత రెండు వారాలుగా ఆయన యాక్టీవ్ పాలిటిక్స్ లోకి వస్తున్నారని తెగ ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలోకి వెళ్తున్నారని.. ముహుర్తం కూడా ఖరారైందని ప్రచారం మొదలు పెట్టారు. మరికొందరు బీజేపీలోకి వెళ్తున్నారని ప్రచారం చేస్తున్నారు. ఇంకొందరు వైసీపీలోకి వెళ్లే ఛాన్స్ ఉందంటూ ప్రచారం సాగిస్తున్నారు. ఆయన చుట్టూ ఇంత ప్రచారం జరుగుతున్నా.. ఆయన మాత్రం నో కామెంట్ అంటున్నారు. ఈ ప్రచారం పీక్స్ కి వెళ్లి.. పార్టీ మారుతున్నది రఘువీరారెడ్డి కాదని.. ఆయన కూతురు అమృత అని చెబుతున్నారు. ఎప్పుడో 2009ఎన్నికల సమయంలో రఘువీరా తరుపున ఎన్నికల ప్రచారంలో కనిపించిన ఆమె ఇప్పుడు టీడీపీలోకి వస్తున్నారని.. వెనుక నుంచి రఘువీరారెడ్డే కథ నడిపిస్తారని ప్రచారం సాగుతోంది.వాస్తవంగా ఈ ప్రచారంలో నిజమెంత అంటే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. కానీ ఆయన సన్నిహితులు మాత్రం ఆయనకు అలాంటి ఆలోచనలే లేవని అంటున్నారు. ఎక్కడో ఫారిన్ లో ఉన్న ఆయన కూతురు ఇక్కడ రాజకీయాల్లోకి వస్తున్నారని చెప్పడం ఏంటని అంటున్నారు. మరి ఈ రూమర్స్ కి చెక్ పడాలంటే చెప్పాల్సిన మనిషి.. చెప్పాల్సిన సంగతి చెప్పాలి. అదేనండి రఘువీరుడు మౌనం వీడేంత వరకు ఈ ప్రచారం ఆగదన్నమాట. మరి చూడాలి భవిష్యత్‌లో ఏం జరుగుతుందో.

# ఉద్యమాన్ని బలహీనపరుస్తున్న ఉద్యోగులు

తిరుపతి, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)కలియుగ వైకుంఠనాథుడి సన్నిధిలో ఉద్యోగమంటే పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. స్వామి వారిని క్షణకాలం దర్శించుకునే భాగ్యం లభిస్తేనే చాలు.. తమ జీవితం ధన్యమని అనుకుంటారు భక్తులు. అటువంటిది స్వామి సన్నిధిలో నిరంతరం భక్తులకు సేవ చేసుకుంటూ.. ఆ సన్నిధిలోనే ఉద్యోగమంటే ఎంతో సంతోషిస్తారు. అందుకే టీటీడీలో ఉద్యోగానికి ఆస్థాయిలో డిమాండ్. చివరకు డిప్యూటేషన్‌పై టీటీడీకి రావడానికి ప్రయత్నించేవాళ్లు ఎందరో. డిప్యూటేషన్‌పై వస్తే తిరిగి వెనక్కి వెళ్లే ప్రయత్నం చెయ్యరు. 1996లో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజుకు 25 వేలు ఉంటే.. ఆ సమయంలో ఉద్యోగులు 14వేల 5 వందల మంది. ప్రస్తుతం భక్తుల సంఖ్య భారీగా పెరిగితే.. ఉద్యోగుల సంఖ్య తరుగుతూ వస్తోంది. రోజుకు లక్ష మంది దర్శనానికి వస్తే.. టీటీడీలో ఉన్న ఉద్యోగులు 6 వేల 597 మంది. బలం తగ్గిందనో ఏమో ప్రస్తుతం ఉద్యోగుల వాయిస్సే వినిపించడం లేదు.గతంలో టీటీడీలో ఉద్యోగ సంఘాలు, నేతలు ఎక్కువ. యాజమాన్యం కూడా వారి మాటకు ప్రాధాన్యం ఇచ్చేది. ఒకదశలో ఉద్యోగ సంఘాల నేతలు విధులకు వచ్చేవారే కాదు. తిరుపతిలోని పరిపాలన భవనానికే పరిమితమై.. సంఘాలను నడపడానికే సమయాన్ని వెచ్చించేవారు. ఆ సంప్రదాయానికి 2003లో చెక్ పెట్టారు అప్పటి ఈవో అజయ్ కల్లాం. ఉద్యోగ సంఘ నేతలకు తిరుమలలోనూ విధులు కేటాయించారు. నాటినుంచి ఉద్యోగుల ఐక్యతకు బీటలు వారింది. 2007లో శ్రీవారి ఆలయంలో 300 బంగారు డాలర్ల మిస్సింగ్ కేసులో డిప్యూటీ ఈవో ప్రభాకర్‌రెడ్డితో సహ కొంతమందిని సస్పెండ్ చేశారు. టీటీడీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి సస్పెండైన అధికారులకు బాసటగా నిలిచారు. పరిపాలన భవనం ముందు ధర్నా చేయడంతో 24 గంటల్లోనే సస్పెన్షన్ ఎత్తేశారు. ఆ ఐక్యత ఇప్పుడు అణుమాత్రం కూడా లేదట.ప్రస్తుతం టీటీడీలో ఉద్యోగులు రిటైర్ అవడమే తప్పితే కొత్తగా నియామకాలు లేవు. ఒకప్పుడు తిరుమల, తిరుపతి పరిధిలోనే ఉండే టీటీడీ ఆలయాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి.

ఔట్ సోర్సింగ్ విధానానికి మొగ్గు చూపారు. ఉద్యోగులను దేశవ్యాప్తంగా బదిలీచేసే వెసులుబాటు లభించడంతో ఐక్యత దెబ్బతింది. సమస్యపై పోరాడే స్థాయి నుంచి పారిపోయే స్థితికి చేరుకున్నారు. గత ఏడాది కాలంలో చిన్నచిన్న తప్పిదాలకు కొందరు సస్పెండైతే.. మరికొందరు ఉద్యోగాన్నే కోల్పోయారు. వాళ్ల తరపున వాయిస్ వినిపించేవాళ్లే లేరు. వారికి మద్దతుగా నిలిస్తే ఎక్కడ బదిలీ చేస్తారో అనే భయం వెంటాడుతోందట. సంఖ్యా బలం లేనప్పుడు పోరాటం ఎందుకని మరికొందరు సైలెంట్ అయ్యారు.కొన్నిరోజుల క్రితం కాంట్రాక్ట్ ఉద్యోగులకు మద్దతిచ్చారన్న కారణంతో ముగ్గురు ఉద్యోగ సంఘాల నేతలను సస్పెండ్ చేశారు. ఈ అంశంపై ఒక్క ఉద్యోగీ మాట్లాడలేదు. పైగా పైవాళ్లను ప్రాధేయపడి సస్పెన్షన్ ఎత్తివేయించుకున్నారట. టీటీడీలో ఉద్యోగ సంఘాల ఎన్నికలు నిర్వహించి పదేళ్లు అవుతున్నా.. ఆ ఊసే ఎత్తే సాహసం ఎవరూ చేయడం లేదు. ఆ మాట పలికితే ఏమౌతుందో అన్న భయం పట్టుకుందట. దీంతో ఒకప్పుడు అమ్మో టీటీడీ ఉద్యోగులా అనే స్థాయి నుంచి ఇప్పుడు అమ్మా.. టీటీడీ ఉద్యోగులా అనే పరిస్థితికి వచ్చారని కామెంట్స్ వినిపిస్తున్నాయట.

# వెలవెలబోతున్న అమరావతి గ్రామాలు

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)రాజధాని పరిస్థితి ఎటూ తేలకపోవడంతో పెళ్లీడుకొచ్చిన పిల్లల పరిస్థితి డోలాయమానంలో పడింది. పూలింగు హడావిడి నడిచిన సమయంలో ఇక్కడ అమ్మాయి, అబ్బాయి అంటే దేశ విదేశాల నుండి వచ్చి ఎగబడి మరీ పెళ్లిళ్లు కుదుర్చుకునేవారు. ప్రస్తుత పరిస్థితి దానికి భిన్నంగా మారింది. ఇక్కడ ఆడపిల్లలంటే చూద్దాములే అనే పరిస్థితి ఏర్పడింది. పూలింగు సమయంలో ప్రతి రోజూ ఏదో ఒక ఊరిలో పెళ్లిళ్ల ఫంక్షన్లకు అందరూ కలిసి వెళ్లేవారు. అన్నీ కళకళలాడుతూ ఉండేవి. ప్రస్తుతం అవేమీ జరగడం లేదు. భూములకు విలువ తగ్గడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. దీనికితోడు పెళ్లిళ్లు చేసిన వారూ చేసిన అప్పులు తీర్చలేక నానా అవస్థలు పడుతున్నారు. గతంలో పెళ్లిళ్లు చేసినా అంతో ఇంతో సొంత పొలం, కొంత కౌలు చేసుకుని వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చుకునేవారు. ప్రస్తుతం ఆదాయం లేదు. పొలానికి విలువా లేదు. మరోవైపు అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోతోంది.రాజధాని పరిధిలోని వెంకటపాలెం గ్రామానికి చెందిన రైతు లంకా ప్రభాకరరావు ఎకరా 40 సెంట్ల భూమున్న రైతు. కొంత కౌలు చేసుకుంటారు. దీనిలో కొంత భూమిని అమ్ముకున్నారు. 60 సెంట్లు పూలింగుకు ఇచ్చారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. 2014 తరువాత వారిద్దరికీ పెళ్లిళ్లు చేశారు. దీనికోసం కొంత అప్పు అయ్యింది. పూలింగు ప్రక్రియ సాగడంతో భూములకు విలువ వస్తుందని, అమ్ముకుని అప్పు తీర్చుకోవచ్చను కున్నారు. కొంత భూమిని అమ్ముకున్నా అనారోగ్య పరిస్థి తుల్లో ఉన్న డబ్బంతా అయిపోయింది. ఒక్కసారి పరిస్థితి మారిపో వడంతో భూములకూ విలువ లేకుండా పోయింది. అదే ఊరిలో ఉన్న భూమిలో ఇళ్లు కట్టుకుందామని ఉన్న రేకుల ఇంటిని పడగొట్టారు. కట్టుబడి మొదలుపెట్టే సమయానికి రాజధాని మారుతుందనే ప్రకటన, బ్యాంకర్లు లోను ఇవ్వబోమని చెప్పడంతో పూలింగుకు భూమి ఇచ్చింది గాక, ఉన్న స్థలంలో కొంత భూమిని కూడా అమ్ముకోవాల్సి వచ్చింది.గ్రామానికి చెందిన శ్రీరామచంద్రమూర్తి నలుగురు అన్నదమ్ములు. ఒక పెంకుటిల్లు అందరూ దాన్ని పంచుకోవాలి. ఉన్న ఎకరం భూమిని పూలింగుకు ఇచ్చారు. శ్రీరామచంద్రమూర్తి కుమారుడు బెంగుళూరులో ఉద్యోగం చేసుకుంటున్నాడు. గతంలో పిల్లను ఇస్తామని వచ్చారు. వచ్చిన భూమిలో ఇల్లు నిర్మించుకుని పెళ్లి చేసుకుందామని ఆగారు. ఇంతలో రాజధాని మార్పు ప్రకటన వచ్చింది. ప్రస్తుతం ఎక్కడకెల్లి పిల్లను చూసినా రాజధాని గ్రామం అనే సరికి ఆలోచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందని పరాశరం వెంకట రమణాచార్యులు కూడా అక్కడే ఉన్న సీతారామస్వామి దేవస్థానం భూములపై ఆధారపడి, అర్చకత్వం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారిది ఎనిమిది మంది సంతానం. పూలింగులో దేవస్థానం భూమిని తీసుకున్నారు. వాటిల్లో సాగు ఉంటే కౌలు తీసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ప్రస్తుతం అర్చకత్వం మాత్రమే ఉంది. రైతుల వద్దా డబ్బులు లేకపోవడంతో ఒకప్పుడు ఎంతో సంతోషంగా సాగిన కుటుంబం కొంత ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రాజధాని పరిధిలోని ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి.

## ఏపీలో భారీగా తగ్గిన దిగుబడులు

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)తుపాన్లు, వరదలు, కరువుల దాడికి ఖరీఫ్‌లో సుమారు పదకొండు లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడులు తగ్గనున్నాయి. ఆగస్టులో ప్రభుత్వం వేసిన మొదటి ముందస్తు అంచనాల్లో 89.43 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఆశించగా ప్రస్తుతం తాజాగా రూపొందించిన రెండవ ముందస్తు అంచనాల్లో 72.37 లక్షల టన్నులకు తగ్గించింది. నిరుడు 87.64 లక్షల టన్నులు లభించగా ఈ ఏట అంతకంటే 9.2 లక్షల టన్నులు తగ్గనున్నాయి. ఈ మారు సీజన్ మొదట్లో నైరుతి రుతుపవనాలు అనుకూలంగా మారడంతో సాగు ఆశాజనకంగా సాగింది. అయితే జూన్ మొదలుకొని నవంబర్ వరకు పలు ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదు కావడంతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు గోదావరి, కృష్ణ నదులు రెండు తడవలు ఉప్పొంగడంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. మరో వైపు ఉత్తరాంధ్రలో తిష్ట వేసిన కరువు సాగును ఆటంకపరిచింది. అతివృష్టి, అనావృష్టి వలన పంటలకు తెగుళ్లు వ్యాపించాయి. ఈ పరిస్థితుల ప్రభావం వలన ఈ సారి దాదాపు అన్ని పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పడిపోతుందని సర్కారు అంచనా వేసింది. తుది లెక్కలచ్చేసరికి దిగుబడులు ఇంకా తగ్గే అవకాశం ఉంది.ఆహార ధాన్యాల్లో ప్రధానమైన వరి దిగుబడి సైతం తగ్గనుంది. సాగు ఇంచుమించు గతేడాదంతా అయింది. ఉత్పాదకత బాగా పడిపోయింది. నిరుడు హెక్టారుకు 5.24 టన్నుల ఉత్పాదకత లభించగా, ఈ ఏడాది మొదటి ముందస్తు అంచనాల్లో 5.09 టన్నులు ఆశించారు. కాగా రెండవ ముందస్తు అంచనాల్లో 4.52 టన్నులకు తగ్గించారు. దాని ప్రకారం ముందుగా 81.48 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుందని పేర్కొని, ఇప్పుడు 72.37 లక్షల టన్నులకు తగ్గించారు. మొదటి అంచనాల కంటే రెండవ అంచనాల్లో 9.22 లక్షల టన్నులు తగ్గుతున్నాయి. నిరుడు 79.98 లక్షల టన్నులు లభించాయి. గతేడాది కంటే ఈ తడవ 7.61 లక్షల టన్నులు తగ్గనున్నాయి. చిరుధాన్యాల్లో ముఖ్యమైన మొక్కజన్నతో పాటు ఖరీఫ్‌లో సాగైన అన్ని రకాల పప్పుధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదకత నిరుటి కంటే, ఈ ఏడాది మొదటి ముందస్తు అంచనాల కంటే తగ్గుతున్నాయి.నూనెగింజల్లో ప్రధానమైన వేరుశనగ దిగుబడులు సైతం తగ్గాయి. మొదటి ముందస్తు అంచనాల్లో 7.33 లక్షల టన్నుల దిగుబడులస్తాయనుకోగా ప్రస్తుతం 5.47 లక్షల టన్నులకు అంచనాలను కుదించారు. ఉత్పాదకత హెక్టారుకు 957 కిలోల నుంచి 735 కిలోలకు తగ్గించారు. నిరుడు 6.22 లక్షల టన్నుల దిగుబడి, 1,095 కిలోల ఉత్పాదకత లభించింది. వాణిజ్య పంటల్లో ముఖ్యమైన పత్తి ఒక్కటే మొదటి ముందస్తు అంచనాల కంటే రెండవ ముందస్తు అంచనాల్లో ఉత్పత్తి పెరుగుతుందని చూపారు. తొలుత 17.70 లక్షల బేళ్ల నుంచి 19.43 లక్షల బేళ్లకు దిగుబడిని పెంచారు. ఉత్పాదకత మాత్రం రెండు అంచనాల్లోనూ 547 కిలోలుగా అంచనా వేశారు. కాగా నిరుడు 24.97 లక్షల బేళ్ల దిగుబడి వచ్చింది. ఉత్పాదకత 649 కిలోలు లభించింది.

## ప్రాసెసింగ్ లో గుంటూరు కారం



గుంటూరు, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)కారం అంటేనే గుంటూరు..! నాణ్యమైన మిర్చికి నగరమే చిరునామా.. ఇక అదే పేరుతో మార్కెట్‌లోకి కారాన్ని వదిలితే విక్రయాలకు తిరుగుంటుందా? గుంటూరు మిర్చి పవర్ అలాంటిది మరి! గుంటూరు మార్కెట్ కమిటీ తాజాగా ప్రాసెసింగ్ రంగంలోకి ప్రవేశిస్తోంది. గుంటూరు మిర్చికున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అదే బ్రాండ్‌తో కారం తయారీ, అమ్మకాలు చేపట్టాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన నాణ్యమైన ఎండుమిరప కాయలను ప్రాసెస్ చేసి కారం విక్రయాలు చేపడతారు. ఇప్పటికే మిర్చి నాణ్యతను నిర్ధారించే యాంత్రిక పరికరాలను సమకూర్చుకోగా మార్కెట్ స్పందనను పరిశీలించి గుంటూరు మిర్చి యార్డు, పల్నాడు మార్కెట్ కమిటీల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించనున్నారు.ఘాటుగా ఉండే గుంటూరు మిర్చికి దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. గుంటూరు మిర్చి యార్డులో ఏటా రూ.6 వేల కోట్ల మేర విక్రయాలు జరుగుతున్నాయి. చైనా, థాయిలాండ్, సింగపూర్ తదితర దేశాలకు రూ.2,000 కోట్ల మేర మిర్చి ఎగుమతులు జరుగుతున్నాయి. ఎండుమిరప ప్రాసెసింగ్ ద్వారా రైతులకు అధిక ధరలతో పాటు మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏసురత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కారం తయారీ, విక్రయాలపై నిర్ణయం తీసుకున్నారు. గుంటూరులో మిల్లులను అద్దెకు తీసుకుని వచ్చే ఏడాది మార్చిలోపు కారం తయారీకి చర్యలు తీసుకుంటున్నారు. మార్క్‌ఫెడ్ బ్రాండ్ మార్కెఫ్ పేరుతో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. మహారాష్ట్రలో మార్కెట్ కమిటీలు రైతులు పండించిన పంటలను ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉప ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నాయి. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు లభించడంతోపాటు కమిటీలు రైతులకు అధిక ధరలను ఇవ్వగలుగుతున్నాయి. ఇదే తరహాలో గుంటూరు మార్కెట్ కమిటీ కారం తయారీతో ప్రాసెసింగ్ రంగంలోకి రానున్నారు.

# మూడు బిల్లులు అంత ఈజీ కాదు...

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లులను మార్పులు చేసి పెట్టడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కన్పించడం లేదు. న్యాయస్థానంలో ఉన్న ఈ కేసు విచారణ వాయిదా పడుతుండటంతో తాను అనుకున్న సమయానికి జగన్ కొత్త బిల్లులను పెట్టే అవకాశం లేదు. జగన్ ఇటీవల మూడు రాజధానుల బిల్లులతో పాటు, సీఆర్డీఏ రద్దు బిల్లును కూడా వెనక్కు తీసుకున్న సంగతి తెలిసిందే. వీటి స్థానంలో కొత్త బిల్లులను తెస్తామని అసెంబ్లీ సాక్షిగా జగన్ చెప్పారు. పాలనా వికేంద్రీకరణ బిల్లులను మార్పులు చేసి జగన్ తేనున్నారు. ఇప్పటికే అధికారులు, న్యాయనిపుణులతో కలిసి బిల్లుల రూపొందించే పనిలో ఉన్నారు. బహుశ కొత్త ఏడాది కొత్త బిల్లులను అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టాలని జగన్ భావించారు. కానీ అది సాధ్యం అయ్యేటట్లు లేదు. మూడు రాజధానుల బిల్లులు, సీఆర్డీఏ రద్దు బిల్లులపై హైకోర్టులో ఇంకా విచారణ జరుగుతుండటమే ఇందుకు కారణం.మూడు రాజధానుల బిల్లులను, సీఆర్డీఏ రద్దు బిల్లులను ప్రభుత్వం వెనక్కు తీసుకున్న తర్వాత ఇక కోర్టులో విచారణ లేదన్నది న్యాయనిపుణుల అభిప్రాయం. ఆ పిటీషన్లకు జీవోలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవడంతోనే చెల్లకుండా పోయినట్లేనని చెబుతున్నారు. ఆ విచారణను క్లోజ్ చేస్తారని భావించారు. కానీ హైకోర్టులో మాత్రం ఇంకా మూడు రాజధానుల బిల్లులు, సీఆర్డీఏ రద్దుపై వాయిదాల పర్వం కొనసాగుతుంది. వాయిదాలతోనే.... తాజాగా ఈరోజు మూడు రాజధానుల బిల్లులు, సీఆర్డీఏ రద్దు బిల్లుపై విచారణను హైకోర్టు వచ్చే నెల 28వ తేదీకి వాయిదా వేసింది. మొత్తం 70కి పైగా దాఖలయిన పిటీషన్లను విచారించవలసి ఉందని హైకోర్టు తెలిపింది.

ప్రభుత్వం చట్టాలను వెనక్కు తీసుకున్నా విచారణ ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజధాని మాస్టర్ ప్లాన్ ను అమలు చేయాలని పిటీషనర్లు కోరా?. దీనిపై విచారించిన హైకోర్టు విచారణను వచ్చే నెల 28వ తేదీకి వాయిదా వేసింది. ఇక అప్పటి వరకూ కొత్త బిల్లులను జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం లేదు.

# రాధా ఎపిసోడ్ పై టీడీపి మౌనం ఎందుకు

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)వంగవీటి రాధా సంచలన కామెంట్స్ చేశారు. తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతుందని చెప్పారు. అయితే ఆయన కామెంట్స్ చేసి 24 గంటలు కావస్తున్నా తెలుగుదేశం పార్టీ నుంచి రెస్పాన్స్ రాలేదు. ఎవరూ దీనిపై మాట్లాడ లేదు. వంగవీటి రాధా ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు వంగవీటి రాధా తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆయన పెద్దగా యాక్టివ్ గా లేకపోయినా అప్పుడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. చిన్న కార్యకర్తపై కేసు పెడితేనే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ వెంటనే ట్విట్టర్ లో స్పందించే వారు. అలాంటిది వంగవీటి రాధా వంటి నేతపై హత్యకు కుట్ర జరిగిందని, ఆయన స్వయంగా ప్రకటించినా టీడీపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీనికి కారణాలేంటన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. వంగవీటి రాధా టీడీపీ నుంచి జంప్ చేసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారన్న అభిప్రాయం టీడీపీలో వ్యక్తమవుతుంది.తనను హత్య చేయడానికి కుట్ర చేస్తున్నారంటూ వంగవీటి రాధా కామెంట్స్ చేసినప్పుడు పక్కనే మంత్రి కొడాలి నాని ఉన్నారు. టీడీపీ రెబల్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఉండటాన్ని టీడీపీ అగ్రనేతలు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. వారిద్దరే కావాలని వంగవీటి రాధా చేత ఈ కామెంట్స్ చేయించారా? పార్టీ నుంచి వెళ్లిపోయే కారణాలు వెతుక్కునేందుకు రాధా ఇటువంటి వ్యాఖ్యలు చేశారా? అన్న అనుమానమూ లేకపోలేదు. పార్టీ నుంచి వెళ్లిపోయేందుకేనా? వంగవీటి రాధా టీడీపీలో ఉన్నప్పటికీ వైసీపీ నేతలతోనూ, పార్టీని విభేదించిన వాళ్లతో చెట్టాపెట్టాలేసుకుని తిరుగుతుండటం టీడీపీ అగ్రనాయకత్వం అనుమానిస్తుంది. ఇది భవిష్యత్ లో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశాలున్నాయని భావిస్తుంది. అందుకే చంద్రబాబు కానీ పార్టీ నేతలు కానీ వంగవీటి రాధా కామెంట్స్ ను లైట్ గా తీసుకున్నారంటున్నారు. టీడీపీ స్థానిక నాయకత్వం కూడా దీనిపై స్పందించడం లేదు. మొత్తం మీద వంగవీటి రాధా హత్యకు కుట్ర చేసిందెవరన్నది ఆయన అయినా స్వయంగా చెప్పాలి. లేకుంటే పోలీసులైనా తేల్చాలి

కుట్ర వెనుక ఎవరు

వంగవీటి రాధా ను హత్య చేసేందుకు కుట్ర జరిగిందా? రాధాను చంపే అవసరం ఎవరికి ఉంటుంది? రాధా ఎందుకు ఈ ఆరోపణలు చేశారు? కావాలనే చేశారా? లేక నిజంగానే రాధాపై హత్యకు కుట్ర జరిగిందా? దానిపై పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేపడితే కాని వాస్తవాలు బయటకు రావు. నిన్న వంగవీటి రాధా తనపై హత్యకు కుట్ర జరిగిందని, రెక్కీ కూడా నిర్వహించారని ఆరోపించడంతో ఇది హాట్ టాపిక్ గా మారింది. వంగవీటి రాధా ను హత్య చేసేందుకు కుట్ర జరిగిందట. ఈ నెల అక్టోబరు 19వ తేదీన రెక్కీ నిర్వహించినట్లు రాధా చెబుతున్నారు. అయితే దాదాపు రెండున్నర నెలలయినా రాధా ఈ విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారు? అన్నది చర్చనీయాంశమైంది. తన తండ్రి వర్ధంతి రోజునే ఈ ఆరోపణలు చేయాల్సిన అవసరం ఏంటి? అసలు రాధాను చంపే అవసరం ఎవరికి ఉంటుంది? ఆయనపై హత్యకు కుట్ర చేసిందెవరు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎవరికి అవసరం? నిజానికి వంగవీటి రాధాను హత్య చేసే అవసరం రాజకీయంగా ఎవరికి ఉండదు. ఎందుకంటే ఆయన దాదాపు దశాబ్దన్నర కాలంగా రాజకీయాల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదు. వరస ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో వంగవీటి రాధా పోటీ కూడా చేయలేదు. ఆయన ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయంగా పెద్దగా శత్రువులు ఎవరూ లేరు. అందరూ సన్నిహితంగా ఉండేవారే. ఇక బెజవాడ ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరపడి దశాబ్దకాలం పైనే అవుతుంది. బలమైన రెండు వర్గాలు ఎవరికి వారు తమ పని తాము చూసుకుంటున్నారు. రాజకీయంగా పైకి ఎదగాలన్న ధ్యాస తప్ప హత్యా రాజకీయాలపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. మరి రాధాను ఎవరు చంపేందుకు కుట్ర పన్నారన్న విషయం తెలియాలంటే పోలీసులు లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. రాధా తన రాజకీయ ఎదుగుదల కోసం ఈ ఆరోపణలు చేశారా? నిజంగానే కుట్ర జరిగిందా? అన్నది ప్రజలకు తెలియాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశముంది.

## ఉద్యోగుల విభజన... వివాదాలు

హైదరాబాద్, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)కొత్త జోనల్ విధానం అమలులో భాగంగా జిల్లా కేడర్‌లోని ఉద్యోగుల కేటాయింపు వివాదాస్పదమవుతోంది. ముఖ్యంగా ఉపాధ్యాయ వర్గాల్లో ఈ విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త జిల్లాలకు బదిలీ అయిన జూనియర్ ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలో నిర్ధారించే ఆదేశాలు ఈ నెల 30 లోగా విద్యాశాఖ ఇవ్వబోతోంది. ఈలోగా ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే సమస్య తలెత్తింది. ఇప్పటికే స్థానికత పేరుతో సొంత జిల్లాలు వదులుకున్నామని, కొత్త ప్రాంతాల్లోనూ మారుమూల ప్రాంతాలకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చాలా జిల్లాల్లో వెళ్ళిన ఉద్యోగుల కన్నా పోస్టులు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో దూర ప్రాంతాల్లో ఉద్యోగులకు సరిపడా పోస్టులే ఖాళీగా ఉంచి, మిగతా వాటిని బ్లాక్ చేస్తున్నారు. అయితే ఆప్షన్లకు అవకాశమిచ్చే ప్రాంతాలన్నీ జిల్లాల్లో మారుమూల ప్రదేశాల్లోనే ఉంటున్నాయని టీచర్లు అంటున్నారు. ఈ రకంగానూ తమకు అన్యాయం జరుగుతోందని మహబూబాబాద్‌కు బదిలీ అయిన టీచర్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాభర్తలు ఒకచోట పనిచేసే అవకాశం కల్పిస్తూ జిల్లా కేడర్ నుంచి ఆప్షన్లు కోరారు. ఈ గడువు కూడా 27 వరకే ఉంది. అయితే ఇంతవరకు మల్టీ జోనల్ పోస్టుల కేటాయింపు జరగలేదు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు సోమవారం ప్రకటించే వీలుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. భార్యా, భర్తల్లో జిల్లా కేడర్‌లో ఒకరు, మల్టీ జోనల్‌లో మరొకరు పనిచేస్తుంటే.. జిల్లా కేడర్‌లో ఉన్న వాళ్ళు ఇప్పుడు ఆప్షన్ ఇస్తారు. మల్టీ జోనల్‌లో పనిచేసే భర్త లేదా భార్యకు ఆ అవకాశం ఇప్పుడు లేదు. అలాంటప్పుడు ఇద్దరు ఒకేచోట పనిచేసే వీలు ఎలా ఉంటుందని టీచర్లు ప్రశ్నిస్తున్నారు.అన్ని కేడర్ల కేటాయింపు జాబితాలు ప్రకటించాకే ఆప్షన్లు పూర్తి చేయాలని కోరుతున్నారు. స్థానికంగా ఉండే ఉపాధ్యాయుల్లోనూ బదిలీల ప్రక్రియ గుబులు రేపుతోంది. ఏళ్ళ తరబడి పనిచేస్తున్న టీచర్లు తాము కోరుకునే ప్రదేశాన్ని కొత్తగా వచ్చే వారితో నింపితే తమకెలా న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు సీనియారిటీ జాబితాలపైనా అన్ని స్థాయిల్లో వివాదం పెరుగుతోంది. వీటిపై అప్పీలుకు వెళ్ళే అవకాశం కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలవంతపు బదిలీలను నిరసిస్తూ మంగళవారం సచివాలయం ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపునిచ్చింది. అత్యవసరంగా వర్చువల్ పద్ధతిలో భేటీ అయిన స్టీరింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంఘం నేతలు చావా రవి తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుం డా అమలు చేస్తున్న బదిలీలు హేతుబద్ధంగా లేవని, అందుకే ఆందోళన బాట పట్టామని తెలిపారు. పరస్పర బదిలీల ద్వారా ఎస్‌జీటీలు సొంత ప్రాంతంలో పనిచేసే అవకాశం కల్పించాలి. భార్యాభర్తలు ఒకే చోట పనిచేసే వీలు కల్పించాలి. కొత్త జిల్లాల్లో పాఠశాలల కేటాయింపును ముందే ప్రకటించాలి. అంతర్ జిల్లా బదిలీల్లోకి వెళ్ళిన టీచర్లకు కొత్త జిల్లా కేటాయిస్తే ఉద్యోగంలో చేరిన తేదీని సీనియారిటీగా గుర్తించాలి. సీనియారిటీలో జరిగిన అవకతవకలను తక్షణమే సరిచేయాల్సి ఉంటుంది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో గొబ్బేమ్మ ఉత్సవం

శ్రీకాళహస్తి డిసెంబర్ 28, (న్యూస్ పల్స్) ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరు గాంచిన శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకు జరుగుతున్న ధనుర్మాసం సందర్భంగా మంగళ వారం గొబ్బెమ్మ అమ్మవారి ఉత్సవమూర్తినిఅలంకరించి మంగళ వాయిద్యాలు తో మేళతాళాలతో నాలుగు మాడ వీధుల్లో వూరేగించారు. అమ్మవారికి అడుగడుగునా హారతులు సమర్పించి భక్తులు దర్శించుకున్నారు. ఊరేగింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి. పెద్దిరాజు, డిప్యూటీ ఈ ఓ ఎన్ ఆర్ కృష్ణ రెడ్డి, ఆలయ ఏఈవో ధనపాల్, ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకట ముని, సూపరెంటెంట్లు విజయ సారధి, నాగభూషణం యాదవ్ ఆలయ అధికారులు పాల్గొన్నారు

## జిల్లా హోంగార్డులకు గుర్తింపు కార్డులు

కాకినాడ డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం నందు హోంగార్డుల సంక్షేమంలో భాగంగా ఈరోజు జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులకు ఎస్పీ రవీంద్రనాథ్ బాబు గుర్తింపు కార్డులను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 993 మంది హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్నారని, వీరంతా పోలీసు శాఖలో ఒక భాగమని, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో కానిస్టేబుల్ లతో సమానంగా హోంగార్డులు కష్టపడుతూ విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. జిల్లాలోని హోంగార్డ్ లకు పోలీసులతో సమానంగా గుర్తింపునిచ్చేందుకు ఈ డిజిటల్ గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, దీనిలో భాగంగా ఈ రోజు 30 మంది హోంగార్డులకు గుర్తింపు కార్డులు అందచేయడం జరిగిందని, మిగిలిన హోంగార్డులకు కూడా కొన్ని రోజుల వ్యవధిలో అందజేయడం జరుగుతుందని, దీనికి గాను తగు ఆదేశాలు జారీచేయడం జరిగిందని తెలియజేసారు.

## నూతన సంవత్సర వేడుకలకు దూరం

### డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం, డిసెంబర్ 28మరో మూడు రోజుల్లో వస్తున్న నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకొన్నట్టు డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్–19 నియంత్రణతో పాటు, కొత్తగా వచ్చిన ఒమిక్రాన్ను కూడా వ్యాప్తికాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచం మొత్తం కరోనా నియంత్రణలో నిమగ్నమై వుంది కాబట్టి ప్రభుత్వాలు చేసే ప్రయత్నాలకు సహకరిస్తూ.. కోవిడ్ నిబంధనలు పాటించడం మనందరి బాధ్యతని, ఆరోగ్యం ఉంటే ఆనందం ఉన్నట్టేనని తెలిపారు. తాను జనవరి1న స్థానికంగా ఎవరికీ అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. అందువల్ల తనను కలవడానికి దయచేసి ఎవరూ ప్రయత్నించవద్దని, కేవలం ఆ ఒక్క రోజు మాత్రమే శుభాకాంక్షలు చెప్పాల్సిన పనిలేదని ఏడాది పొడవునా అందరికీ శుభాలు జరిగి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మన ఆత్మీయతలు, అనుబంధాలు, ఎప్పటికీ చెక్కు చెదరవన్నారు. పరిస్థితులు చక్కబడే వరకు మూకుమ్మడి వేడుకలకు దూరంగా ఉండాలని, కోవిడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా తన సన్నిహితులు, స్నేహితులు, శ్రేయభిలాషులు, సహచరులు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నానని పేర్కొన్నారు.

## అక్రమ విల్లాలపై విచారణ ప్రారంభం

కుత్బుల్లాపూర్ దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేటలోని లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ లో అక్రమ విల్లాలపై ఉన్నతాధికారుల రహస్యంగా విచారణ ప్రారంభమయింది. మీడియాను అనుమతించకుండా అక్రమ విల్లలపై విచారణ జరపడం అనేక సందేహాలకు తావిస్తోంది. అక్రమ కట్టాడాల విషంయంపై మొత్తం మీద ఉన్నతాధికారులు విజిట్ చేపి విచారణ ప్రారంభించారు. అయితే, మీడియాను అనుమతించని అంతగా సీక్రెట్ ఏముందోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## నగదు, క్రెడిట్ కార్డులు స్వాధీనం

పాలకొండ పాలకొండ స్టేట్ బ్యాంక్ కులో క్రెడిట్ కార్డులు కుంభకోణంలో పోలీసులు నిగ్గుతేల్చారు. లోతైన దర్యాప్తు చేపట్టి అసలైన నిజాలు రాబట్టారు.కొంతకాలంగా పెండింగ్లో ఉన్న ఈ కేసును ఒక కొలిక్కి తీసుకువచ్చారు. రూ.26 లక్షలు నగదు స్వాహా అయినట్టు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం స్థానిక పోలీస్టేషన్ డిఎస్పి ఎం.శ్రావణి విలేకరులకు వివరించారు. కొత్తూరు మండలం కుంటిభద్రకు చెందిన ఎ.రాజేష్ పాలకొండ స్టేట్ బ్యాంక్ లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. క్రెడిట్ కార్డుదారుల యూజర్ నేమ్, పాస్వర్డును సేకరించి క్రెడిట్ కార్డులు వినియోగించని వారిని గుర్తించి ఫోన్లు చేసి మాట్లాడేవాడని తెలిపారు. మీ క్రెడిట్ కార్డు రద్దవుతుందని, కార్డు వెంటనే అప్పగించాలని చెప్పడంతో కార్డుదారులు వచ్చి కార్డులను అప్పగించే వారని పేర్కొన్నారు.

# మమ అనిపిస్తున్న భేటీలు

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)ఏపీలో లక్షలాది మంది ఉద్యోగులకు కీలకమైన పీఆర్సీ కసరత్తు కొలిక్కి రాలేదు. ఫిట్‌మెంట్‌పై తేలుస్తారా తేల్చరా అని ఉద్యోగ సంఘాలు గట్టిగా అడగడంతో? ఆ మధ్య జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించారు అధికారులు. 13 సంఘాలకు ఆహ్వానాలు వెళ్లడంతో వారంతా సూచించిన టైమ్‌కు చెప్పిన లొకేషన్ బ్లాక్ నెంబర్ 2 దగ్గరకు వచ్చేశారు. సీఎస్ సమీర్ శర్మ నేతృత్వంలో ఆర్థికశాఖ కార్యదర్శులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉంది. ఉద్యోగ సంఘ నాయకులు కమిటి హాల్‌లోకి వెళ్లి కూర్చున్నారు. ఐదు కావటానికి పావుగంట ముందే సీఎస్ సచివాలయం నుంచి తాడేపల్లిలోని సీఎమ్ క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోవడంతో అంతా కంగుతిన్నారు.సీఎస్ లేకపోయినా ముగ్గురు ఆర్థికశాఖ కార్యదర్శులు మీటింగ్ హాలులో ఉండటంతో ఉద్యోగ సంఘాల నేతలు సర్ది చెప్పుకొన్నారట. ఇక్కడే ఇంకో ట్విస్ట్ ఉంది. హెచ్‌ఆర్ ఫైనాన్స్ కార్యదర్శి శశిభూషణ్ సమావేశానికి వచ్చిన నేతల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తే.. మిగిలిన ఇద్దరు కార్యదర్శులు రావత్, సత్యనారాయణలు తమతో తెచ్చుకున్న ల్యాప్ టాపుల్లో మునిగిపోయి.. తమ సమయం వృథా కాకుండా చూసుకున్నారట. దీంతో సీఎస్ వచ్చేంత వరకు మాటలు కలుపుతా.. అసలు విషయం పెద్దాయనతోనే మాట్లాడుకోవాలని చెప్పారట శశిభూషణ్. సీఎస్ రావటం లేటవుతుందేమో.. షుగర్ పేషెంట్స్‌కు ఇబ్బంది లేకుండా మరోదఫా స్నాక్స్ తెప్పిస్తాను.. అని సెటైర్లు వేశారట. టిఫిన్లు తిని, చల్లటి ఏసీ రూమ్‌లో వేడి వేడిగా టీ కాఫీలు తాగి.. నాయకులంతా పాత రీల్ మళ్లీ రీప్లే చేయడంతో అక్కడున్నవాళ్లకు సౌండ్ లేదట. 8 గంటలకు సీఎస్ సమీర్ శర్మ సచివాలయానికి వచ్చారు. అప్పటికే వెయింటింగ్‌లో ఉన్న ఐకాస నేతలు అలిసిపోయి ఉంటారని భావించారో ఏమో.. 14 శాతం ఫిట్‌మెంట్‌తో సరిపెట్టేద్దాం అని సీఎస్ చెబితే.. ఉద్యోగ సంఘాల నాయకులు 34కి తగ్గేది లేదని సమాధానం ఇచ్చారు. 14 శాతం ఫిట్‌మెంట్ నివేదిక తప్పుల తడకగా కొట్టిపారేశారు ఐకాస నేతలు. ఇలా పావు గంట గడిచాక.. అధికారులు చాణక్యం ప్రదర్శించారు. మా లెక్కలు తప్పంటున్నారు కదా.. మళ్లీ లెక్కలు వెరిఫై చేస్తాం అని బదులివ్వడంతో? మీటింగ్‌లో ఏదో తేలిపోతుందని అనుకున్న ఉద్యోగులకు ఆ సమాధానం మింగుడుపడలేదు. ఇదంతా కాదు సీఎం దగ్గరే తేల్చుకుంటా అని ఉద్యోగ సంఘాల నేతలు చెప్పడంతో.. చిరునవ్వులు చిందించారట అధికారులు. అయితే ఓకే.. ఇప్పుడు సీఎం ఉండరు. మళ్లీ వచ్చే వారమే అని మీటింగ్‌కు క్లోజ్ చేశారట. ఎంతో ఉత్సాహంతో మీటింగ్‌కు వెళ్లిన ఉద్యోగ సంఘాల నేతల ఉస్సూరు మంటూ బయటకొచ్చారు. ఏమైంది అని మీడియా ప్రశ్నిస్తే.. ఏముందీ ఈ మీటింగ్ కూడా మమ అనిపించారని నిట్టూర్పులిడిచారు. అదండీ.. పీఆర్సీపై మీటింగ్‌లో టీ కాఫీలకు, టిఫిన్లకు ఇస్తున్న ప్రాధాన్యం.. సమస్య పరిష్కారనికి ఇవ్వడం లేదని సచివాలయ వర్గాల్లో ఒక్కటే సణుగుడు.

# మైనారిటీ ఓటు బ్యాంకు పై టిడిపి చూపు

అమరావతి డిసెంబర్ 28 మైనారిటీ ఓటు బ్యాంకు.. ఇది ఇప్పుడు అన్ని పార్టీలకూ అత్యంత కీలకం. 2014లో 5 శాతం ఉన్న వీరి ఓటు బ్యాంకు.. ఇప్పుడు 12 శాతం పెరిగింది. వచ్చే ఎన్నికల నాటికి అంటే.. 2019 నాటికి ఇది మరో శాతం పెరిగే అవకాశం ఉందని లెక్కలు వేస్తున్నారు. దీంతో ఈ ఓటు బ్యాంకును కైవసం చేసుకుంటే.. తమకు మేలు జరుగుతుందని అంటున్నారు నాయకులు.అయితే.. ప్రస్తుతం వైసీపీకి అనుకూలంగా ఈ ఓటు బ్యాంకు ఉంది. వైఎస్ హయాం నుంచి కూడా మైనారిటీ ఓటు బ్యాంకును స్థిరపరుస్తూ నాయకులు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అప్పట్లో వారికి 4 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే.. కోర్టు దీనిని కొట్టేసినా.. సాను భూతి అయితే అలానే నిలబడి పోయింది.ఆ తర్వాత.. మైనారిటీలు.. కాంగ్రెస్కు అనుకూలంగా వ్యవహరించారు. ఆ తర్వాత.. రాష్ట్ర విభజన అనంతరం వైసీపీ వైపు మళ్లారు. అయితే.. ఆదిలో వీరి ఓటు బ్యాంకుపై ఉదాసీనంగా వ్యవహరించిన టీడీపీ.. తర్వాత కాలంలో మాత్రం.. వీరి ఓటు బ్యాంకు పెరుగు తుండడంతో.. ఇప్పుడు ఈ ఓటు బ్యాంకును తమవైపు మళ్లించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వంలో ఉన్న సమయంలోనే శాసన మండలి చైర్మన్ పదవిని ఈ వర్గానికి ఇచ్చారు. అయితే.. ఇది ఆశించినంత మేరకు ఫలితం ఇవ్వలేదు. పైగా మైనారిటీ వర్గాలు ఎన్నికల్లో విజయం దక్కించుకోలేక పోయారు.ఇక అప్పటి నుంచి కూడా ఈ వర్గం టీడీపీ వైపు మళ్లలేక పోయారు. కానీ ఇదే పరిస్థితి ఇలానే ఉంటే.. వచ్చే ఎన్నికల్లో మరింత నష్టం వస్తుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలో కనీసం.. పది నియోజకవర్గాల్లో అయినా.. మైనారిటీలకు టికెట్లు ఇవ్వాలని.. భావిస్తున్నారు. అయితే.. ఆ మేరకు.. నాయకులు ఉన్నారా ? ఉన్నా.. గెలుపు గుర్రం ఎక్కుతారనే నమ్మకం ఉన్నవారు ఎవరు?

అనేచర్చ జోరుగా సాగుతోంది. కానీ ఇవ్వాలనే వాదన మాత్రం బలంగా వినిపిస్తోంది.మరో వైపు వైసీపీ మైనార్టీలకు విపరీతమైన ప్రయార్టీ ఇస్తోంది. ఇప్పటికే మండలి నుంచి ఏకంగా నలుగురు ఎమ్మెల్సీలకు అవకాశం ఇచ్చింది. ఇక స్థానిక పదవుల్లో కూడా వారికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఈ క్రమంలోనే ఇప్పుడు టీడీపీ కూడా మైనార్టీలకు ప్రాధాన్యత పెంచాలని చూస్తోంది. ముఖ్యంగా కడప కర్నూలు అనంతపురం విజయవాడ తదితర కీలక ప్రాంతాల్లో ముస్లిం మైనార్టీలకు అవకాశం ఇస్తే బాగుంటుందనే.. చర్చ సాగుతోంది. అయితే.. టికెట్ల కోసం ఎవరూ ముందుకు రావడం లేదు. ఎందుకంటే.. వైసీపీ దూకుడు ముందు తాము గెలుస్తామోలేదో.. అనే సందేహాలు ఉండడమే. మరి దీనిని చంద్రబాబు ఎలా డీల్ చేస్తారో చూడాలి.

# రోడ్డు ప్రమాదంలో తొమ్మిదిమందికి గాయాలు

ఏలూరు డిసెంబర్ 28 పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం కొవ్వూరు–గుండుగొలను జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం కొవ్వూరు–గుండుగొలను జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. విశాఖ జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన మిడ్ డే మిల్క్కు చెందిన తొమ్మిది మంది ఉద్యోగులు కలిసి కారులో.. విజయవాడలో జరిగే సమావేశానికి బయలుదేరారు.వీరు పశ్చిమగోదావరి జిల్లా పోలసానిపల్లి సమీపానికి వచ్చేసరికి కారు అదుపుతప్పి.. రహదారి పక్కకు రక్షణ గోడ మధ్యలో దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బాలయ్య ఇంటి ముట్టడి

అనంతపురం, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా హిందూపురంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. హిందూపురంలో సినిమా సీన్‌ను తలపించే ఘటన చోటు చేసుకుంది. ఒకవైపు టీడీపీ కేడర్.. మరోవైపు వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి ముట్టడికి బయల్దేరిన వైసీపీ కార్యకర్తలను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఆరోపణలతో ఆ ప్రాంతం వేడెక్కింది. ఒకరిపై మరొకరు సవాళ్లు విసురుకున్నారు.పట్టణంలో డంపింగ్ యార్ట్ మార్పు అంశంపై టీడీపీ కార్యకర్తలు మండిపడ్డారు. పట్టణంలోని డంపింగ్ యార్డ్‌ను మార్చేందుకు ఎమ్మెల్సీ ఇక్బాల్ కృషి చేశారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఇన్నేళ్లలో హిందూపురానికి ఒరగబెట్టిందేమీ లేదంటూ టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై చర్చకు కూడా సిద్ధమంటూ సవాల్ విసిరారు టీడీపీ నాయకులు. దీంతో టీడీపీ నాయకుల ఆరోపణలపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై చర్చకు సిద్ధమంటూ టీడీపీ కార్యకర్తలకు ప్రతి సవాల్ విసిరారు వైసీపీ నాయకులు. ఈ డైలాగ్‌లు ఇంతటితో ఆగలేదు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి దగ్గరే చర్చిద్దాం అంటూ వైసీపీ కేడర్ బయల్దేరింది. బాలకృష్ణ ఇంటిని ముట్టడించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించగా.. వారికి టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో.. హిందూపురంలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసులు బాలకృష్ణ ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు.హిందూపురంలో డంపింగ్ యార్డు తరలింపు తప్ప మరే అభివృద్ధి చేయలేదని టీడీపీ పార్లమెంట్ ఇన్ ఛార్జ్ చంద్రమౌళీ విమర్శించడంతో వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బాలకృష్ణ ఇంటి వద్దే ఇరువర్గాల నాయకులు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకోవడంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది

## కారు, ఆటో ఢీ?. వ్యక్తి మృతి

చిత్తూరుచిత్తూరు జిల్లా పలమనేరు ,చెరువు కట్టపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కారు ఆటో ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందాడు. సాయి నగర్ కు చెందిన ఆటో డ్రైవర్ రాజు, తన ఆటోలో పలమనేరుకి వస్తుండగా కర్నాటక రిజిస్ట్రేషన్ కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సంఘటనా స్థలంలోనే ఆటో డ్రైవర్ రాజు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆటోలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## జనవరి 1న, జనవరి 13 నుండి 22వ తేదీ వరకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు

తిరుమల, డిసెంబరు 27స్వయంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనంభక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు సామాన్య భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జనవరి 1న, వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 13 నుండి 22వ తేదీ వరకు స్వయంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే విఐపి బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుందని, వారి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలియజేయడమైనది. భక్తులు కోవిడ్ వ్యాక్సినేషన్ లేదా నెగెటివ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరడమైనది. శ్రీవారి ఆలయంలో జనవరి 13న వైకుంఠ ఏకాదశి, జనవరి 14న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా విచ్చేసే భక్తులకు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సంతృప్తికరమైన దర్శనం కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపడుతోంది. ఈ పర్వదినాల నేపథ్యంలో జనవరి 13 నుండి 22వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనుంది.గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ రద్దు– జనవరి 11 నుండి 14వ తేదీ వరకు వసతి గదుల అడ్వాన్స్ రిజర్వేషన్‌ను రద్దు చేయడమైనది. శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తుల వసతికి పెద్దపీట వేస్తూ తిరుమలలోని అన్ని గదులను కరెంటు బుకింగ్ ద్వారా కేటాయించాలని టిటిడి నిర్ణయించింది.– జనవరి 11 నుండి 14వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ప్రివిలేజ్ ఉండదు.కల్యాణకట్ట– తలనీలాలు తీసేందుకు తగినంత మంది క్షురకులను అందుబాటులో ఉంచడం జరిగింది. కోవిడ్–19 నిబంధనలు పాటిస్తూ క్షురకులు పిపిఇ కిట్లు, అప్రాన్లు వినియోగిస్తారు.అన్నప్రసాదం అన్నప్రసాద భవనంలో కోవిడ్–19 నిబంధనలు పాటిస్తూ ఈ 10 రోజుల పాటు ఉదయం 4 నుండి రాత్రి 12 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుంది.వైద్యం– భక్తులకు వైద్యసేవలందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయి.కోవిడ్ నిబంధనలుకోవిడ్ వ్యాక్సినేషన్ లేదా నెగెటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి– కోవిడ్ – 19 మూడవ వేవ్ ఒమిక్రాన్ రూపంలో దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేశాయి. అదేవిధంగా, కొన్ని పట్టణాల్లో రాత్రి కర్ఫ్యూ కూడా విధించారు. ఈ నేపథ్యంలో భక్తులు పర్వదినాల్లోనే కాకుండా మిగతా అన్ని రోజుల్లోనూ వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ కానీ, దర్శనానికి 48 గంటల ముందు చేసుకున్న ఆర్‌టిపిసిఆర్ పరీక్ష నెగిటివ్ సర్టిఫికేట్ కానీ తప్పనిసరిగా తీసుకురావాలి.

## హిందూపురం లో ఉద్రిక్తత

అనంతపురం అనంతపురం జిల్లా హిందూపురంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటి ముట్టడికి వైసీపీ కార్యకర్తలు బయలుదేరడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. పట్టణంలో డంపింగ్ యార్డు మార్పు అంశంపై టీడీపీ కార్యకర్తలు మండిపడ్డారు. ఇన్నాళ్లూ వైసీపీ ప్రభుత్వం హిందూపురంకు చేసిందేమీ లేదని టీడీపీ కార్యకర్తలు ఆరోపించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైసీపీ కార్యకర్తలు... బాలకృష్ణ ఇంటి వద్దే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. దీంతో అధికార పార్టీ కార్యకర్తలు బాలకృష్ణ ఇంటి ముట్టడికి బయలుదేరారు. రెండు పార్టీల నేతలు బాలయ్య ఇంటికి బయలుదేరడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడ భారీగా పోలీసులను మోహరిం చారు.హిందూపురంలోని డంపింగ్ యార్డును ఎమ్మెల్సీ ఇక్బాల్ ఆధ్వర్యంలో ఇతర ప్రాంతానికి తరలించారు. రెండున్న రేళ్ల వైసీపీ పాలనలో డంపింగ్ యార్డు తరలింపు తప్ప మరో అభివృద్ధి పనిచేయలేదని టీడీపీ పార్లమెంట్ ఇన్ ఛార్జ్ చంద్రమౌళీ విమర్శించడంతో వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

# ఒమిక్రాన్ వేరియంట్ వైరస్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉందాం



## ఏపీఎమ్మార్పీఎస్..

మంత్రాలయం డిసెంబర్ 28 ( విభారె) : ఒమి క్రాన్ వేరియంట్ వైరస్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు పందికోన ఈరన్న మరియు మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు నేపాల్ మాట్లాడుతూ..ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరోన..ఈ కరోన వైరస్ బారిన పడి అనేక మంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారని , చివరకు దేశం లో ఉన్నటువంటి వివిధ రంగాలు మరియు కుటుంబాల జీవన విధానం అస్తవ్యస్తమైందని ,చివరికు ఆర్థిక వ్యవస్థ కూడా చిన్నాభిన్నమై పోయిందని..ఇప్పుడిప్పుడే ఈ కరోనా వైరస్ బారినుండి ప్రజలు తేరుకుంటున్న. అటువంటి నేపథ్యంలో .. ఇప్పుడు కరోనా వైరస్ కొత్త పుంతలు తొక్కుతూ ఒమిక్రాన్ వేరియంట్ వైరస్ గా రూపాంతరం చెందింది.. కాబట్టి ఈ వైరస్ చెందిన ఆనవాలు పలు దేశాల్లో ప్రజల్లో కనిపిస్తున్నాయి.. కాబట్టి మన కర్నూలు జిల్లా గౌ.శ్రీ. కోటేశ్వరరావ్ కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మరియు ఎస్ పి గారి ఆదేశాల మేరకు మరియు పలు పత్రికల్లో ఒమిక్రాన్ వైరస్ పై వస్తున్న వార్తలను చూస్తునే ఉన్నాం..కాబట్టి ప్రతి ఒక్కరు ఒమిగ్రాన్ వైరస్ పై అవగాహన కలిగి ఉందాం..” సామాజిక దూరం- పరిసరాల పరిశు భ్రత- పౌష్టిక ఆహారం నుంచి కనీస జాగ్రత్తలు పాటిద్దాం..ఈ ఒమిక్రాన్ వైరస్ ను మన దేశం నుండి మన జిల్లా నుండి తరిమికొడదాం.. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు టౌన్ ఇన్చార్జి యాకోబు మరియు రామయ్య మంత్రాలయం యేసు దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారులు అనుమతి లేకుండా పాఠశాల భవనం మార్పు

### ఏబీవీపీ ఎమ్మిగనూరు శాఖ

ఎమ్మిగనూరు డిసెంబర్ 28 ( విభారె) : పట్టణంలోని రవీంద్ర భారతి స్కూల్ పై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎం ఈ ఓ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మారుతి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా పాఠశాల భవనం మార్పుచేయడం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. అలాగే కొత్త భవనంలో కనీస మౌలిక వసతులు లేవని అత్యవసరమైన ఫైర్ సర్టిఫికెట్, ఆటస్థలం లేవని ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని కోవిడ్-19 నియమ నిబంధనలను ఉల్లంఘనీచారని కొంత మంది విద్యార్థుల బ్యాగులు మరియు పాఠశాల రికార్డులు, స్టాంపులు మరియు విద్యార్థులకు మంచినీటి సౌకర్యం,




మరుగుదొడ్లు లేకుండా పాఠశాల నడుపుతున్నారని కొత్త భవనాన్ని వెంటనే సీజ్ చేసి రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని అలాగే డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హేమంత్ మరియు రాజు పాల్గొన్నారు

## మద్దికేర నందు వైస్సార్ పొలం బడి కార్యక్రమం

మద్దికేరడిసెంబర్ 28 ( విభారె) మండల కేంద్రమైన మద్దికేర గ్రామం నందు వ్యవసాయ శాఖ అధికారులు వైయస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రోజున పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి ఆధ్వర్యంలో మద్దికెర గ్రామం నందు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు చదరపు మీటర్ నందు గల మొక్కల సాంద్రత ఎలా లెకించాలో,శనగ పంట చ.మీ కు 33 మొక్కలుండాలని,దీని వల్ల దిగుబడిలో కలిగే తేడాలను వారు రైతులకు వివరించారు. అనంతరం ఏడిఏ ఖాద్రి మరియు మండల వ్యవసాయ అధికారిణి హేమలత లు పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.పంట వేసిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పంట నమోదు చేపించుకోవాలని,లేని యెడల ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్ వర్తించదని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ లు యోగేంద్ర,శ్రీనివాస్ రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు జాకీర్,ఆనంద్,కవిత,రాణి మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు ప్రజా సేవే లక్ష్యంగా పని చేయాలి....



### ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

### వైసిపి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట.

### నాడు నేడు ద్వారా కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు.

### ప్రజా సమస్యలు తీర్చే వరకు ప్రతి సర్వసభ్య సమావేశానికి తప్పకుండా హాజరవుతాను

తుగ్గలిడిసెంబర్ 28 ( విభారె) : ప్రజా సేవే లక్ష్యంగా పెట్టుకొని అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పనిచేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలియజేశారు.మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు రెండవ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆదెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరయ్యారు.సర్వసభ్య సమావేశంలో భాగంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే పనుల గురించి వివరించారు.ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు.పెండేకల్లు ఆర్ఎస్ గ్రామంలో పైపులైన్ ఏర్పాటు చేయాలని, జొన్నగిరి గ్రామంలో మరొక నీటి బోరు వేయాలని,అదేవిధంగా రాతన గ్రామంలో ట్యాంకు లీకేజీ సమస్య ఉన్నదని మరియు మోటార్ సమస్యలు చాలా ఉన్నాయని ప్రజా ప్రతినిధులు అధికారులకు తెలియజేశారు. అనంతరం హౌసింగ్ డిపార్ట్మెంట్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 21 లేఅవుట్లు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు.మండల వ్యాప్తంగా 470 ఓటిఎస్ లు పూర్తయ్యాయని ఆయన తెలియజేశారు.అనంతరం వ్యవసాయశాఖ అధికారి ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ తుగ్గలి మండలానికి కరువు మండలంగా ప్రకటించారని తెలియజేశారు.18 ఆర్బికె కేంద్రాల యందు ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలియజేశారు.మైనర్ ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ తుగ్గలి మండలంలో 13 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటి సరఫరా పనులు జనవరి నుంచి ప్రారంభమవుతాయని తెలియజేశారు.అనంతరం ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కరోనా ద్వారా ప్రాథమిక కేంద్రాల్లో అన్ని వసతులూ పుష్కలంగా ఉన్నాయని ఆయన తెలియజేశారు.నాడు నేడు పనుల ద్వారా 24 లక్షల నిధులతో తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులు నిర్వహించామని ఆయన తెలియజేశారు. జనవరి 1 నుంచి బూస్టర్ డోసులను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వైయస్సార్ కంటి వెలుగు ద్వారా చాలా మందికి కంటి ఆపరేషన్లు చేసినట్లు ఆయన తెలియజేశారు.అనంతరం ఉపాధిహామీ ఎపిఓ రామకృష్ణ మాట్లాడుతూ త్వరలో ల్యాండ్ డెవలప్మెంట్ మరియు హార్టికల్చర్ ద్వారా పనులకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలియజేశారు.అనంతరం విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 18 లేఔట్ లకు పవర్ సప్లై అందజేస్తామని తెలియజేశారు. అనంతరం బాట తాండ,రాంపురం ప్రజా ప్రతినిధులు ఎలక్ట్రికల్ ఏఈ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.బాట తాండలోని ఒక కాలనీకు కరెంటు పోల్స్ ను సరఫరా చేయడం లేదని ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు.అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 77 అంగన్వాడీలలో 24 సొంత భవనాలలో,44 అద్దె భవనాలలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. అనంతరం మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొదటి విడతలో ఎంపికైన 20 స్కూళ్లలో నాడు నేడు ద్వారా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు.జగనన్న గోరుముద్ద మరియు జగనన్న విద్యా కానుక వంటి పథకాలు అమలు అవుతున్నాయని ఆయన తెలియజేశారు. చిన్న జొన్నగిరి లోని పాఠశాలను నూతనంగా నిర్మిస్తామని,కిచెన్ షెడ్ లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు ఎంఈఓ తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.ఓటీఎస్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకొనేలా చైతన్య పరచాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేశారు.అతివృష్టి వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని కనుక తుగ్గలి మండలం ను కరువు మండలంగా ప్రతిపాదనలు పంపాలని ఆమె తెలియజేశారు.జొన్నగిరి చెరువుకట్ట కు సంబంధించి లీకేజ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యాప్తంగా 36 కోట్ల నిధులతో 13 చెరువుల పనులను జనవరి నుండి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. 104 సేవలను మండల వ్యాప్తంగా మెరుగుపరచాలని ఆమె ఎంపీడీవో కు ఆదేశాలు జారీ చేశారు. తండ్రికి తగ్గ తనయుడిలా ఆరోగ్యశ్రీ నందు రక రకాల వ్యాధులను చేర్చి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని ఆమె తెలియజేశారు. నాడు నేడు పనులు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకువచ్చాయని తెలియజేశారు. రాంపురం గ్రామానికి సంబంధించిన ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డు పనులను ప్రారంభించిన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జగనన్న ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారని మహిళల కొరకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ప్రతి ఒక్క సర్వసభ్య సమావేశానికి తప్పకుండా హాజరు అవుతారని ఎమ్మెల్యే తెలియజేశారు. చివరిగా ఓటిఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు జగనన్న శాశ్వత గృహ హక్కు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదెమ్మ,ఎమ్మార్వో నజ్మా భాను, పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ జిట్టా లక్ష్మీదేవి, ఎంపీడీవో వీర రాజు, ఏవో పార్థసారథి,వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి,జడ్పీటీసీ పులికొండ నాయక్,వైసిపి నాయకులు పగిడిరాయి జగన్నాథ్ రెడ్డి,అట్ల గోపాల్ రెడ్డి,బసి రెడ్డి, పగిడిరాయి రంగ న్న,గంగాధర్,రఘు,తుగ్గలిమండలం సర్పం చులు,ఎంపీటీసీలు,మండల స్థాయి వివిధ శాఖల అధికారులు,తుగ్గలి మరియు జొన్నగిరి పోలీసులు,వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరాయ్.. పుష్పరాజ్ దిల్ ఖుష్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప- ది రైజ్' తొలి వారం భారీ వసూళ్లను సాధించి సక్సెస్ ఫుల్ గా రన్నింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. డిసెంబర్ 17న రిలీజ్ అయిన సినిమాకు క్రిస్మస్ వీకెంట్ బాగా కలిసొచ్చింది. క్రిస్మస్ కానుకగానే నేచురల్ స్టార్ నాని నటించిన 'శ్యామ్ సింగరాయ్' రిలీజ్ అయినా ఆ ప్రభావం 'పుష్ప' పై పెద్దగా పడలేదు. బన్ని .. నాని ఎవరి క్రేజ్ తో వారు మార్కెట్ లో దూసుకుపోతున్నారు. సింగరాయ్ కి పుష్ప కంటే మంచి టాక్ వచ్చినప్పటికీ బన్నీ బ్రాండ్ ఇమేజ్ తో బ్యాలెన్స్ చేస్తున్నాడు. చాలాచోట్ల నాని సినిమా కంటే బన్నీ సినిమాకే ఎక్కువ థియేటర్లను హోల్డ్ చేసి ఆడిస్తున్నారు. అయితే క్రిస్మస్ వీకెండ్ ని మాత్రం రెండు సినిమాలు ఎన్ క్యాష్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యాయి.'శ్యామ్ సింగరాయ్' రిలీజ్ తో 'పుష్ప' వసూళ్లు తగ్గుతాయని ఊహాగానాలొచ్చినా మెజార్టీ థియేటర్స్ 'పుష్ప'ని ముందంజలో ఉంచుతున్నాయి. శ్యామ్ సింగరాయ్ తొలిరోజు మంచి వసూళ్లను సాధించింది. రెండు..మూడు రోజుల పాటు సింగరాయ్ వసూళు ఫస్ట్ డేకి ఏ మాత్రం తగ్గకుండా ఉన్నాయి. సినిమా బ్రేక్ ఈవెన్ దిశగా పయనిస్తోంది. ఆదివారం పబ్లిక్ హాలీడే కావడం తో అన్ని షోలు హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడించింది. ఇక తొలి వారం తర్వాత 'పుష్ప' వేగం తగ్గినట్లు అనిపించినా మళ్లీ సెకెండ్ వీక్ లో పుంజుకుంది. శని..ఆదివారాలు మంచి క్యుపెన్సీ కనిపించింది. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించింది.36 కోట్లకు నైజాం హక్కుల్ని దిల్ రాజు విక్రయించగా దాదాపు సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయారు సీడెడ్ లోనూ బ్రేక్ ఈవెన్ కి చేరువలో ఉంది. ఆంధ్రాలో మాత్రం పరిస్థితుల్ని భిన్నంగా ఉన్నాయి. బ్రేక్ ఈవెన్ కి చాలా దూరంలో ఉంది. టిక్కెట్లు తగ్గడం..థియేటర్లను మూసివేయడం వంటి అంశాలు ఏపీలో వసూళ్లకు అడ్డంకిగా మారింది. హిందీ..తమిళం..మలయాళం భాషల్లో పంపిణీ దారులు లాభాల బాటలో ఉన్నారు. ఇక అమెరికాలో మంచి వసూళ్లనే సాధించింది. అఖండ తర్వాత పుష్ప.. శ్యామ్ సింగరాయ్ చక్కని ఫలితాలతో హోప్ ని పెంచాయి. తదుపరి సంక్రాంతి సినిమాలు దీనిని ఇంకా పెద్ద స్థాయికి తీసుకెళతాయని అంతా ఆశిస్తున్నారు.

# 'గుడ్ లక్ సఖీ' కి బ్యాడ్ టైమ్ నడుస్తోందా..?

దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేష్.. 2021లో ఇప్పటికే 'రంగ్ దే' 'పెద్దన్న' 'మరక్కార్' వంటి మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించింది. ఈ క్రమంలో "గుడ్ లక్ సఖీ" అనే మరో చిత్రాన్ని విడుదలకు సిద్ధం చేశారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ స్పోర్ట్స్ డ్రామాని డిసెంబర్ 31న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరో మూడు రోజుల్లో రిలీజ్ ఉన్నా ఈ సఖి ఎక్కడా హడావుడి చేయడం లేదు. "గుడ్ లక్ సఖీ" చిత్రంలో కీర్తి సురేష్ తోపాటుగా ఆది పినిశెట్టి - జగపతిబాబు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ నగేష్ కుకునూర్ దీనికి దర్శకత్వం వహించారు. ఓ గ్రామీణ యువతి అంతర్జాతీయ షూటర్ గా ఎలా మారిందనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. దేవిశ్రీప్రసాద్ సంగీతం సమకూర్చారు.



దిల్ రాజ్ సమర్పణలో సుధీర్ చంద్ర - శ్రావ్యా వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు.స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజ్ సమర్పిస్తున్న సినిమా కావడం.. 'మహానటి' కీర్తి సురేష్ నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ కావడంతో అందరి దృష్టి ఈ సినిమాపై పడింది. అయితే వాయిదాల మీద వాయిదాలు వేస్తూ ఉండటంతో దీనిపై కాస్త ఆసక్తి కూడా తగ్గిందనే టాక్ ఉంది. ఎట్టకేలకు ఈ నెల చివర్లో వస్తుందని అనుకుంటుండగా.. మేకర్స్ 'గుడ్ లక్ సఖీ' ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కీర్తి కూడా సినిమా గురించి ఎక్కడా మాట్లాడటం లేదు.మరోవైపు నిన్న కాక మొన్న విడుదల తేదీని ప్రకటించిన సినిమాలు మాత్రం శరవేగంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీని లాక్ చేసుకున్న 'అర్జున ఫల్గుణ' - జనవరి 1న రాబోతున్న 'ఇందువదన' కూడా ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేశాయి. కానీ 'గుడ్ లక్ సఖి' మాత్రం సైలెంట్ గా ఉంటోంది. దీంతో ఈ సినిమా మరోసారి పోస్ట్ పోన్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయని టాక్ నడుస్తోంది.ఒకవేళ కీర్తి సురేష్ సినిమా కనుక వాయిదా పడితే ఇప్పట్లో మరో మంచి రిలీజ్ డేట్ దొరికే అవకాశం లేదు. ఎందుకంటే జనవరి ఫస్ట్ వీక్ లో 'ఆర్.ఆర్.ఆర్' మొదలుకొని 'రాధే శ్యామ్' 'బంగార్రాజు' 'మేజర్' 'ఖిలాడి' 'భీమ్లా నాయక్' 'రామారావు ఆన్ డ్యూటీ' వంటి పలు పెద్ద సినిమాల విడుదలలు ఉన్నాయి. వీటి మధ్య గ్యాప్ లో మీడియం రేంజ్ సినిమాలు ఎలాగూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'గుడ్ లక్ సఖి' రిలీజ్ అయితే లక్ కలిసొస్తుందో లేదో చెప్పలేం. మరి ఈ సినిమా విడుదల విషయంలో నిర్మాతలు ఏం ఆలోచిస్తున్నారో.

# ఏట వాలు చూపులతో జిల్లనిపించిన వాణీ



వార్ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంలో నటించింది వాణీ కపూర్. అంతకుముందు కెరీర్ తో పోలిస్తే వార్ తనకి మేలిమిమలుపు అని చెప్పాలి. ఆ తర్వాత వరుసగా క్రేజీ పాన్ ఇండియా ఆఫర్లతో వాణీ మరింత బిజీ అయిపోయింది.ఇప్పుడు వాణీ కపూర్ కి ప్రభాస్ సలార్ లో కీలక పాత్రను ఆఫర్ చేసారు ప్రశాంత్ నీల్. విలన్ కు జతగా వాణీకపూర్ నటిస్తుందని కథనాలొచ్చాయి. ఇక వాణీ ఒడ్డు పొడుగు కిక్కెక్కించే అందచందాలు సలార్ కి ప్లస్ కానున్నాయని అంతా భావిస్తున్నారు. ఈ క్రిస్మస్ ని పురస్కరించుకుని వాణీ ఇదిగో ఇలా చిలౌట్ మూవ్ మెంట్ ని ఇన్ స్టా వేదికగా షేర్ చేసింది. తన ఒంటిపై స్టార్స్ మెరుపులు మిరుమిట్లు గొలుపుతున్నాయి. వాణీ అలా స్టైలిస్తూ జిల్లనిపిస్తోంది. ఈ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేస్తూ ఏటవాలు చూపులతో జిల్లనిపిస్తున్న వాణీ అంటూ పొగిడేస్తోంది యూత్.వాణీ కపూర్ బాలీవుడ్ సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే అమ్మడు నటించిన 'బెల్ బాటమ్' రిలీజ్ అయింది. కానీ సినిమా ఆశించనంతగా రాణించలేదు. ప్రస్తుతం కరణ్ మల్హోత్రా తెరకెక్కిస్తోన్న 'షామ్ శ్రీ' అనే భారీ బడ్జెట్ పిరియాడిక్ చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్..సంజయ్ దత్ హీరోలగా నటిస్తున్నారు. అలాగే అభిషేక్ కపూర్ దర్శకత్వంలో 'చండీఘర్ కరే ఆషికిల్' లో నటిస్తోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నాడు.

# భారత బౌలర్ల దెబ్బ.. 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ప్రొటీస్



భారత బౌలర్లు దక్షిణాఫ్రికాకు చుక్కలు చూపిస్తున్నారు. వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతున్నారు. దీంతో 32 పరుగులకే ప్రొటీస్ నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రస్తుతం తెంబా బవుమా, క్వింటన్ డికాక్ క్రీజులో ఉన్నారు. బుమ్రా ఒకటి, షమీ రెండు, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు. 4: 22ఖఓ- మహ్మద్ షమీ బౌలింగ్లో ప్రొటీస్ బ్యాటర్ కీగన్ పీటర్సన్ అవుటయ్యాడు. దీంతో 30 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా రెండో వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం మార్కరమ్, రసే వాన్ డెర్ డసెన్ క్రీజులో ఉన్నారు. లంచ్ బ్రేక్ సమయానికి ప్రొటీస్ జట్టు స్కోరు: 21/1 (7). పీటర్సన్(11), మార్కరమ్(9) క్రీజులో ఉన్నారు. టీమిండియాతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా మొదటి వికెట్ కోల్పోయింది. బుమ్రా బౌలింగ్లో ప్రొటీస్ కెప్టెన్ డీన్ ఎల్గర్ పంత్కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. కేవలం ఒకే ఒక్క పరుగు చేసి నిష్క్రమించాడు. ఎయిడెన్ మార్కరమ్, కీగన్ పీటర్సన్ క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి టీమిండియా ఆటగాళ్లు చేతులెత్తేశారు. దీంతో మూడో రోజు ఆటలో భాగంగా 327 పరుగులకు టీమిండియా ఆలౌట్ అయింది. కాగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ మూడు వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. అయితే, వర్షం కారణంగా రెండో రోజు ఆట రద్దు కాగా... మంగళవారం ఆట ప్రారంభించిన కొద్ది సేపటికే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంగిడికి అత్యధికంగా 6 వికెట్లు దక్కగా... రబడ 3, జాన్సెన్ ఒక వికెట్ పడగొట్టారు. ఇక టీమిండియా ఆటగాళ్లలో కేఎల్ రాహుల్ 123 పరుగులతో టాప్ స్కోరర్గా నిలిచాడు. మయాంక్ అగర్వాల్(60), కోహ్లి(35), రహానే(48), బుమ్రా (14) మినహా మిగతా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు.టీమిండియా తొమ్మిదో వికెట్ కోల్పోయింది. మహ్మద్ షమీ ఎంగిడి బౌలింగ్లో డికాక్కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ క్రీజులో ఉన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**